

కలెక్టరేట్‌కు ప్రభుత్వ కార్యాలయాల పంచాయితీ!

జిల్లాల విభజన జరిగి నాలుగేళ్లుపైనే అయ్యింది. అయినా ఇంత వరకు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు సమకూరలేదు. అద్దె భవనాల్లోనే అధికశాతం ప్రభుత్వ కార్యాలయాలు నడుస్తున్నాయి. కొన్నింటిని కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయ భవనాల్లో అప్పట్లో తాత్కాలికంగా సర్దుబాటు చేశారు. అయితే తాజాగా జిల్లా ప్రణాళిక విభాగం (సీపీవో) కార్యాలయంలో నడుపుతున్న సమాచార, పర్యాటకశాఖ కార్యాలయాలను ఖాళీ చేయించాలని ఆ విభాగం అధికారి పట్టుబట్టారు. దీంతో ఈ పంచాయితీ కలెక్టరేట్‌కు చేరింది.

సీపీవో కార్యాలయ భవనంలో సమాచార, పర్యాటకశాఖ కార్యాలయాలు

వెంటనే ఖాళీ చేయాలని ప్రణాళికా విభాగం అధికారి పట్టు

- ట్రైనీ కలెక్టర్ కార్యాలయంలోకి మార్చిన పర్యాటకశాఖ కార్యాలయం
- సమాచారశాఖ కార్యాలయం కూడా ఖాళీ చేయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి
- వివాదాస్పదంగా ప్రణాళికా విభాగం అధికారి తీరు
- నేటికీ అధికశాతం ప్రభుత్వ విభాగాల కార్యాలయాలు అద్దె భవనాల్లోనే..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో ప్రణాళికా విభాగం (సీపీవో) కార్యాలయం ఉంది. ఈ కార్యాలయ భవనంలోని రెండు గదుల్లో జిల్లా సమాచారశాఖ కార్యాలయాన్ని అప్పటి కలెక్టర్ సూచనలతో పెట్టారు. సీపీవో కార్యాలయంలోని మరో గదిలో జిల్లా పర్యాటకశాఖ కార్యాలయాన్ని కూడా నడుపుతున్నారు. గతంలో పనిచేసిన సీపీవోలు ఈ రెండు కార్యాలయాలు ఇక్కడే ఉన్నా, ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదు. ఇటీవల బదిలీపై వచ్చిన సీపీవో కొంతకాలంగా ఈ రెండు కార్యాలయాలను ఇక్కడి నుంచి ఖాళీ చేయించాలని కలెక్టర్ వద్ద ప్రతిపాదన పెట్టారు. సీపీవో నుంచి ఒత్తిడి అధికం కావడంతో పర్యాటకశాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్‌లోని ట్రైనీ కలెక్టర్ కార్యాలయంలోకి గురువారం మార్చారు. ఇదిలా ఉంటే సమాచార శాఖ కార్యాలయాన్ని కూడా ఇక్కడి నుంచి మార్చివేయాలని సీపీవో రెండు రోజుల క్రితం కలెక్టర్ వద్ద పంచాయితీ పెట్టారు. సీపీవో కార్యాలయం భవనం కిందభాగంలో, పైభాగంలో గదులు ఖాళీగానే ఉన్నా ఇక్కడున్న రెండు ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీ చేయాలని సీపీవో ప్రతిపాదన చేయడం మిగతా 6లో..



కలెక్టరేట్‌లోని జిల్లాప్రణాళికా విభాగం(సీపీవో) కార్యాలయం

భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసేనా!

జిల్లాల విభజన జరిగిన సమయంలో ప్రభుత్వ స్థలంలో భవన సముదాయాన్ని నిర్మించి, అందులోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలను నడపాలనే ప్రతిపాదన చేశారు. కానీ ఆ ప్రతిపాదనలు కాగితాలను దాటలేదు. దీంతో జిల్లాలో సర్వశిక్ష అభియాన్, జిల్లా సహకారశాఖ అధికారి కార్యాలయం, గృహ నిర్మాణశాఖ, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు కార్యాలయం, బీసీ కార్పొరేషన్, అటవీశాఖ, పరిశ్రమలు, దేవదాయశాఖ, మార్కెటింగ్‌శాఖ, భూగర్భ గనులశాఖ, ఖనిజశాఖ, భూగర్భ జల అధికారి కార్యాలయం, ఎక్సైజ్ విభాగం సూపరింటెండెంట్ తదితర కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఈఈ, డీవైఈవో కార్యాలయాలను నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న పాత భవనంలో నడుపుతున్నారు. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, ఈఈ కార్యాలయాలను మచిలీపట్నం డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. జిల్లా విభజన తర్వాత కలెక్టర్, జేసీ కార్యాలయాలను కొంత మేర ఆధునీకరించి సరిపెట్టారు. జలవనరులశాఖ ఈఈ కార్యాలయానికి సంబంధించి గుడివాడలో భవనాలు ఉన్నా, విజయవాడలోనే ఈ కార్యాలయం నేటికీ నడపడం గమనార్హం.

ఈ భవనాల నిర్మాణం పూర్తయ్యేనా!

మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజీ పక్కనే ఉన్న మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయాలు బ్రిటిష్ వారి కాలంలో నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరాయి. 2018, సెప్టెంబరు 28వ తేదీన ఈ రెండు కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. పునాదుల దశ వరకు వీటిని నిర్మించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రెండు కార్యాలయ భవనాల నిర్మాణాన్ని నిలిపివేశారు. తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు పల్లపు ప్రాంతంలో ఉండటంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో వర్షపు నీరు కార్యాలయాల్లోకి ప్రవేశిస్తోంది. రెండేళ్ల క్రితం మచిలీపట్నం మండలాన్ని నార్త్, సౌత్ మండలాలు విభజించారు. నార్త్ మండల కార్యాలయం పాత భవనంలో కొనసాగుతుండగా, సౌత్ మండల కార్యాలయాన్ని జలవనరులశాఖ అతిథి గృహంలో నడుపుతున్నారు. నిలిచిపోయిన మచిలీపట్నం తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల భవనాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జోరుగా పేకాట!

పామర్రు నియోజకవర్గంలో శిబిరాల నిర్వహణ

చేతులు మారుతున్న లక్షల రూపాయల నగదు

- ఓ పోలీస్ అధికారి, కొందరు రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే వ్యవహారం!
- గుడివాడ డీఎస్పీ, మచిలీపట్నం ఎస్‌బీ కార్యాలయాల్లో వేగుల నియామకం



జిల్లాలో పేకాట జోరందుకుంది. గుట్టుగా పలు ప్రాంతాల్లో శిబిరాలు నడుస్తున్నాయి. ఇటీవల పామర్రు పరిసర ప్రాంతాల్లో ఓ పోలీస్ అధికారి, కొందరు అధికార పార్టీ నాయకులు జూద శిబిరాల నిర్వహణకు తెరతీశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో పేకాట నడిపిన మచిలీపట్నానికి చెందిన వ్యక్తితో కలిసి ఓ పోలీస్ అధికారి గత పది రోజులుగా పామర్రు, పరిసర ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటు చేయిస్తూ అందినకాడికి నగదు దండుకుంటున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. బుధవారం పామర్రు మండలం కురుమద్దాలిలో 45 మందికిపైగా పేకాట రాయుళ్లను తీసుకువచ్చి పేకాట ఆడించినట్లు విశ్వసనీయ సమాచారం. గురువారం తెల్లవారు జాము వరకు యలమర్రు గ్రామంలో పేకాట శిబిరం నడిచినట్టు సమాచారం. ఈ శిబిరాల్లో రూ.లక్షలు చేతులు మారుతున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి: పామర్రు నియోజకవర్గం, సమీప గ్రామాలైన కురుమద్దాలి, నిమ్మలూరు, పసుమర్రు, నిడుమోలు, జోకిపర్రు, యలమర్రు తదితర ప్రాంతాల్లో పేకాట శిబిరాలు జోరుగా నడుస్తున్నట్టు సమాచారం. పేకాట శిబిరాలు ఎక్కడ ఏర్పాటు చేయాలి, ఎంత సమయం వరకు నిర్వహించాలి అనే అంశాలపై ఓ పోలీస్ అధికారే ప్రణాళిక రచిస్తున్నారని పేకాట రాయుళ్లే చెప్పుకుంటున్నారు. ఈ అధికారి వద్ద ఉండే ఒక కానిస్టేబుల్ వాహనంలో పేకాట శిబిరాలు నిర్వహించే ప్రాంతంలో రాత్రంతా గస్తీ తిరుగుతూ పేకాట శిబిరాలను పర్యవేక్షిస్తున్నాడని తెలిసింది.

రాత్రి 11 నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు..

మచిలీపట్నం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు లేదా గుడివాడ డీఎస్పీ కార్యాలయం నుంచి ప్రత్యేక బృందాలు పేకాట మిగతా 6లో..

జానకిరామయ్య పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, (ఇన్‌సెట్‌లో) మండవ జానకి రామయ్య



ఆంధ్ర కురియన్ మండవ

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా సుదీర్ఘకాలం సేవలు

- పాడి రైతుల అభివృద్ధిలో జానకిరామయ్యది చరగని ముద్ర
- చిన అవుటపల్లిలోని స్వగృహంలో కన్నుమూత
- నివాళులర్పించిన చైర్మన్ చలసాని, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు

ఆంధ్ర కురియన్‌గా ప్రసిద్ధి చెందిన కృష్ణా మిల్క్ యూనియన్ పూర్వ చైర్మన్ మండవ జానకిరామయ్య గన్నవరం మండలం చిన అవుటపల్లి రుషివాటికలోని స్వగృహంలో గురువారం కన్నుమూశారు. యూనియన్ చైర్మన్‌గా ఆయన సుదీర్ఘకాలం పాటు సేవలందించారు. ఆ సమయంలో సంస్థ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. పాల ఉత్పత్తిదారులకు సకాలంలో సబ్సిడీలు ఇవ్వడం పాటు వారిని ప్రోత్సహించేందుకు అనేక వినూత్న కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. డెయిరీ రంగంలో అనేక ఉన్నత పదవులను అధిరోహించి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. మూడు దశాబ్దాల పాటు యూనియన్‌లో ఎన్నో ఆవిష్కరణ చేసిన మండవ మృతి పాడి పరిశ్రమకు తీరని లోటని ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు కొనియాడారు. 8

జీఎస్టీ తగ్గింపును బొక్కేస్తున్నారు!



మెడికల్ విభాగంలో రిటైల్ వ్యాపారుల దందా!

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో కొనుగోలుదారులకు అందని జీఎస్టీ ప్రయోజనాలు
- కొత్త ఎంఆర్‌పీ వచ్చినా పాత ఎంఆర్‌పీకే అమ్మకాలు
- మెడికల్ షాపుల నిర్వహణ తీరుపై తనిఖీలు నిల్
- విమర్శలు వ్యక్తం చేస్తున్న ప్రజలు




వైద్యం ఖరీదు అయిన ప్రస్తుత పరిస్థితుల్లో మందుల విషయంలో అంతో, ఇంతో జీఎస్టీ ప్రయోజనం రోగులకు దక్కుతుందనే ఉద్దేశంతో మెడిసిన్‌పై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా ఆ ఫలాలు పేదలకు అందడంలేదు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని కార్పొరేట్ హాస్పిటల్స్‌లోని సింహభాగం మెడికల్ షాపుల నుంచి మార్కెట్‌లో రిటైల్ మందుల దుకాణాల వరకు జీఎస్టీ ప్రయోజనాలను బొక్కేస్తున్నారు. కొత్త ఎంఆర్‌పీ వచ్చినా పాత ఎంఆర్‌పీకే అమ్మకాలు యథేచ్ఛగా చేసేస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన వ్యవస్థలు అటువైపు కన్నెత్తి చూడటంలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల వ్యాప్తంగా మొత్తం 700 హోల్‌సేల్ మెడికల్ ఏజెన్సీలు, మూడు వేల మెడికల్ రిటైల్ దుకాణాలు ఉన్నాయి. ఒక్క విజయవాడ నగరంలోనే 600 హోల్‌సేల్ మెడికల్ ఏజెన్సీలు ఉండగా.. రెండు వేలకుపైగా రిటైల్ దుకాణాలు నడుస్తున్నాయి. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో మరో 100 మెడికల్ హోల్‌సేల్ ఏజెన్సీలు ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో 1000 వరకు మెడికల్ రిటైల్ దుకాణాలు ఉన్నాయి. హోల్‌సేల్ మెడికల్ ఏజెన్సీల నుంచి కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరల ప్రకారం సవరించిన ఎంఆర్‌పీతోనే రిటైల్ వ్యాపారులకు విక్రయించటం జరుగుతోంది. పాత మందులు ఉండటంతో వాటిపై కొత్త ఎంఆర్‌పీ కూడా వేసి ఇస్తున్నారు. పాత, కొత్త ఎంఆర్‌పీ మందులపై ఉంటున్నాయి. సవరించిన ఎంఆర్‌పీతో పాటు హోల్‌సేల్ వ్యాపారి లాభం కూడా తగ్గించి ఇవ్వటంతో పాటు, మరికొంత డిస్కౌంట్ కూడా ఇచ్చి రిటైల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఉదాహరణకు కొన్ని మందులు, సిరప్‌లు చూద్దాం.. డయటాల్ డీ క్యాప్స్ (10 ట్యాబ్లెట్స్ షీట్) పాత ఎంఆర్‌పీ రూ.150 కాగా, కొత్త ఎంఆర్‌పీ రూ.133.47 ఇచ్చారు. ఈ ఎంఆర్‌పీపై విక్రయించేందుకు రిటైల్ దుకాణదారుడికి లాభం రావాలి కాబట్టి ట్యాబ్లెట్ షీట్‌ను రూ.101.70లకే అందిస్తున్నారు. డిస్కౌంట్‌గా మరో రూ.12 ఇస్తున్నారు. దీంతో అసలు మిగతా 6లో..

పలురకాల మందుల పాత, కొత్త ఎంఆర్‌పీలు ఇలా

మందు పేరు	పాత ఎంఆర్‌పీ	కొత్త ఎంఆర్‌పీ
డీ3 మస్ట్ డ్రాప్స్ (15ఎం)	రూ.43.84	రూ. 41.1
నోవాస్టాట్ సీవీ 10 ట్యాబ్స్	రూ.408	రూ.382.5
ఏటీఎం 100 ఎంజీ సిరప్	రూ.54.95	రూ.51.52
టెంటెక్స్ ఫోర్ట్ ట్యాబ్లెట్ (10)	రూ.130	రూ.121
ఫైలెక్స్ ఫోర్ట్ ఓనిట్ 30జీ	రూ.160	రూ.150
సిస్టోన్ టీబీఎస్ (60)	రూ.260	రూ.243.75
జాన్సిసన్ సిరప్ 100 ఎం	రూ.90	రూ.84.38
జాన్సిసన్ డ్రాప్స్	రూ.95	రూ.89
మెఫ్టాల్ 250 ఎంజీ	రూ.23	రూ.21
టస్క్. డీఎక్స్ ట్యాబ్	రూ.60	రూ.56



తరగతి గదిలో ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు

- ఇద్దరు విద్యార్థినులకు తీవ్ర గాయాలు
- మోటూరు బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఘటన

6



మీ వాహన టైర్లు సురక్షితమేనా!

- వర్షం పడుతున్నప్పుడు పొంచి ఉన్న ప్రమాదాలు
- టైర్ల వినియోగంలో జాగ్రత్తలు అవసరం

8



జాతీయ రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలు

గుంతల కారిడార్!

ఎన్‌హెచ్-16లోని వీఐపీ కారిడార్‌లో అధ్వానంగా రోడ్డు

- నిడమానూరు నుంచి రమేశ్ ఆస్పత్రి వరకు అన్నీ గుంతలే..
- సుమారు ఐదు కిలోమీటర్ల ప్రయాణం నరకం
- ముందుకు కదల్లేకపోతున్న భారీ వాహనాలు
- తరచూ ట్రాఫిక్ జామ్.. వాహనచోదకుల అవస్థలు

ఎన్‌హెచ్-16లోని వీఐపీ కారిడార్ ఉమ్మడి కృష్ణాజిల్లాలో అధ్వానంగా తయారైంది. నిడమానూరు నుంచి రమేశ్ ఆస్పత్రి వరకు అడుగడుగునా గుంతలతో ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. భారీ వాహనాలు వేగంగా ముందుకు కదల్లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. గన్నవరం విమానాశ్రయంలో దిగి విజయవాడ, అమరావతి వచ్చే ప్రముఖులకు ఈ రహదారే దిక్కు. అయినా ఈ రోడ్డు అభివృద్ధిపై అధికారులు మీనమేషాలు లెక్కించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి-విజయవాడ : చెన్నై నుంచి కోల్‌కత్తా వరకు విస్తరించి ఉన్న ఎన్‌హెచ్-16 రాష్ట్రంలో పలు నగరాలతో పాటు విజయవాడను కూడా తాకుతుంది. విజయవాడలోని కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి గన్నవరం వరకు ఉన్న హైవేను వీఐపీ కారిడార్‌గా పిలుస్తారు. దేశం నలుమూలల నుంచి రాజధాని అమరావతి, విజయవాడకు చేరుకునే వారు ఎవరైనా గన్నవరం విమానాశ్రయంలో దిగి ఈ రోడ్డు మార్గాన(అత్యవసర సమయంలో ప్రధాని, ముఖ్యమంత్రితో సహా) రావాల్సిందే. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారి గోతులతో నిండిపోయి అధ్వానంగా మిగతా 6లో..



పూర్తిగా దెబ్బతిన్నజాతీయ రహదారి

శాశ్వత వంతెన ఏదీ?

» బుడమేరువాగుతో ఇరువై ఏళ్లగా రైతుల అవస్థలు
» గేదెలు, ముగ్గురు పిల్లలు చనిపోయిన సంఘనటలు
» వరద వస్తే పొలాలకు వెళ్లే పరిస్థితి లేదు
» కూటమి ప్రభుత్వంలోనైనా వంతెన నిర్మించాలి

మైలవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నారాయణనగర్ సమీపంలో ఉన్న బుడమేరు వాగు ఆయకట్టు ప్రాంతంలో సుమారు 400ల హెక్టార్ల పంట పొలాలు, 300ల మంది రైతులు ఉంటున్నారు. వీరు పంట పొలాలకు వెళ్లాలంటే బుడమేరు వాగు దాటి వెళ్లాల్సిందే. వాగుపై వంతెన నిర్మించాలని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తున్నా తాత్కాలిక చప్టాలు వేసి సరిపెడుతున్నారని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదలు వచ్చిన సమయంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో చప్టాలు కొట్టుకుపోతున్నాయని.. దీంతో రైతులు పొలాలకు మందు కొట్టాలన్నా, పాడి పశువులకు గడ్డి కోసుకురావలన్నా, కూలీలను తీసుకువెళ్లే అవకాశం లేకుండా పోతోందని రైతులు గోడును వెళ్లబోసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గేదెలు కొట్టుకుపోయాయని చెబుతున్నారు. గతంలో చప్టాల వద్దే ముగ్గురు చిన్నారుల ప్రాణాలు పోయాయి. స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో పలు మార్లు రైతులే స్వంత ఖర్చులతో దారి ఏర్పాటు చేసుకొంటున్నారు. పంటలకు పెట్టుబడుల కంటే దారి ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పడించిన పంటను తీసుకురావాలంటే వాహనాలు వెళ్లే పరిస్థితులు లేక అవస్థలు పడుతున్నారు.


వరదకు కొట్టుకుపోయిన చప్టా

మైలవరం పట్టణ రైతులందరికీ బుడమేరు ఆయకట్టుకు అవతల ఒడ్డున పొలాలు ఉన్నాయి. జి.కొండూరు మండలం చిన నందిగామ, కుంటముక్కల గ్రామ రైతులు పొలాలకు వెళ్లాలంటే బుడమేరు వాగు దాటాల్సిందే. ఎమ్మెల్యేలు, మంత్రులు మారుతున్నా తమ సమస్యలు తీరడంలేదని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేస్తున్నా హామీలకే పరిమితమవుతున్నాయే తప్ప శాశ్వత పరిష్కారం చూపడంలేదని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా స్థానిక ఎమ్మెల్యే రైతుల సమస్యలపై ప్రతేక దృష్టి సారించి బుడమేరు వాగుపై శాశ్వత వంతెన నిర్మించేలా కృషి చేయాలని రైతన్నలు వేడుకుంటున్నారు.


సొంత ఖర్చులతో దారి వేసుకుంటున్న రైతులు(ఫైల్)

రైతుల కష్టాలు పట్టవా..


- పరికెల మోహనరావు, రైతు

వంతెన నిర్మించాలని ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందజేస్తున్నా రైతు కష్టాలు పట్టించుకోవడం లేదు. కొనేళ్లుగా బుడమేరు వాగుపై వంతెన నిర్మించాలని చెబుతున్నా పట్టించుకోవడంలేదు. నేతలు మారుతున్నా శాశ్వత పరిష్కారం దొరకడంలేదు. ప్రభుత్వం స్పందించి వాగుపై శాశ్వత వంతెన నిర్మించాలి.

తాత్కాలిక చప్టాలతో ప్రయోజనంలేదు


- పసుపులేటి శ్రీనివాసరావు, రైతు

తాత్కాలిక చప్టాలతో ప్రయోజనం లేదు.. వరదలు వచ్చినప్పుడల్లా కొట్టుకుపోతున్నాయి. వాగు దాటి పొలాలకు వెళ్లాలంటే నరకప్రాయంగా ఉంటోంది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు వంతెన ఏర్పాటు చేయాలి.


నాగపుట్టలో పాలు పోసి పూజలు చేస్తున్న న్యాయమూర్తి

సుబ్బారాయుడిని దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి

మోపిదేవి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి అభిషేక్ రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. న్యాయమూర్తికి అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలుకగా, పర్యవేక్షకులు మధుసూదనరావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.


శిబిరంలో వైద్యపరీక్షలు చేసుకుంటున్న పెన్షనర్లు

పెన్షనర్లకు ఆస్టర్ ఉచిత వైద్య శిబిరం

విజయవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పెన్షనర్స్ హాలులో ఆస్టర్ రమేశ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.దాలినాయుడు ప్రారంభించారు. శిబిరంలో 110 మంది పెన్షనర్లకు ఆసుపత్రి సిబ్బంది బీపీ, షుగర్, ఊపిరితిత్తుల సామర్థ్యం, ఈసీజీ, టుడీ ఎకో పరీక్షలు నిర్వహించారు. రిపోర్టులను బట్టి సంబంధిత వైద్యులు మందులు అందజేశారు. అనంతరం పల్మనాలజీ డాక్టర్ ఎన్.బాలకృష్ణ మాట్లాడుతూ, వయస్సు మళ్లినవారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, సంవత్సరానికి ఒకసారి, ఐదేళ్లకు ఒకసారి చేయించుకోవాల్సిన పరీక్షలు, ఇంజక్షన్ల గురించి వివరించారు.

నత్తల నివారణపై రైతులకు అవగాహన

» నేడు శాస్త్రవేత్తల పరిశీలన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

జి.కొండూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నత్తల నివారణపై రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నామని ఉద్యాన అధికారి వేణు పేర్కొన్నారు. గురువారం 'హడలెత్తిస్తున్న ఆఫ్రికా నత్తలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆఫ్రికన్ జెయింట్ నత్తల సమస్యపై అవగాహన కల్పిస్తున్నామని, సహజసిద్ధ పద్ధతితో వాటని నిర్మూలించుకునే విషయాలు వివరిస్తున్నామన్నారు. ఈమేరకు ఈనెల 7న గడ్డమణుగు గ్రామంలో నత్తల బారిన పడిన వంగ తోటను శాస్త్రవేత్తల బృందంతో పరిశీలిస్తామని ఆయన తెలిపారు.


గ్యాస్ లీక్‌తో హోటల్‌లో చెలరేగిన మంటలు

హోటల్‌లో గ్యాస్ లీక్.. తృటిలో తప్పిన ప్రమాదం

మోపిదేవి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోటల్‌లో గ్యాస్ బండ లీకై మంటలు వ్యాపించి తృటిలో పెను ప్రమాదం తప్పిన సంఘటన మోపిదేవి ప్రధాన కూడలి వద్ద గురువారం రాత్రి జరిగింది. ప్రధాన కూడలి వద్ద హోటల్‌లో గ్యాస్ బండ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అదే సమయంలో హోటల్‌లో టిఫిన్ చేస్తున్నవారు భయపడి పరుగులు తీశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి అతి చేరువలో హోటల్ ఉండటంతో భక్తులు ఆందోళనకు లోనయ్యారు. గ్రామస్థుల సహాయంతో దేవస్థానంలో ఉన్న అగ్నిమాపక యంత్రాల ద్వారా మంటలను అదుపు చేశారు. దీంతో భక్తులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి విచ్చేసి మంటలను పూర్తిగా అదుపు చేశారు.

గురుకుల పాఠశాలలో దారుణం

» స్లాబ్ పెచ్చులూడి ఇద్దరు విద్యార్థినులకు గాయాలు

గుడివాడ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : మోటూరు బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శ్లాబు పెచ్చులూడి విద్యార్థినుల తలపై పడటంతో ఇద్దరు గాయాలపాలైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బుధవారం సాయంత్రం తరగతి గదిలో కూర్చుని రాసుకుంటున్న విద్యార్థినులపై శ్లాబు పెచ్చులూడి పడటంతో ఇద్దరు బాలికలకు గాయాలయ్యాయి. ఒకరి తలపై పడి తీవ్ర రక్తస్రావంకాగా.. మరో బాలికకు కాలుపై గాయమైనట్టు సమాచారం. విద్యార్థినులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం శిథిలమైనా, అదే గదిలో విద్యార్థినులను కూర్చోబెట్టడం ప్రిన్సిపాల్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. భవనం దుస్థితిపై అధికారులకు సమాచారమందించినా చర్యలు తీసుకోకపోవడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినుల భద్రత కోసం తక్షణం భవనానికి మరమ్మతులు చేయించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జనవరి నుంచి కృష్ణా జలాల సరఫరా

» కిడ్నీ వ్యాధి బాధితులకు మందులు, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి
» వైద్యుల సూచనలను పాటించండి
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఎ.కొండూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో వచ్చే జనవరి నుంచి కృష్ణా జలాలు సరఫరా చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోందని, నిరంతర పర్యవేక్షణతో వైద్యసేవలు అందజేసి, రానున్న జనవరి నుంచి కృష్ణా జలాలు సరఫరా చేస్తామని కలెక్టర్ తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి స్పందించిన కలెక్టర్ ఎ.కొండూరు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఎ.కొండూరు పీహెచ్‌సీలో డయాలసిస్ యూనిట్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కృష్ణారావుపాలెంలోని రక్షిత మంచి నీటి సరఫరా ట్యాంక్‌లో నీటి నాణ్యతను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, కిడ్నీ రోగులు వైద్యుల సూచనల మేరకు మందులు, పౌష్టికాహారం, శారీరక వ్యాయామం చేస్తే ఆరోగ్యం ఉంటారని తెలిపారు. ఎ.కొండూరు పీహెచ్‌సీలో వారంలో ఒక్కరోజు నెఫ్రాలజిస్టు డాక్టర్ అందుబాటులో ఉంటారని, వారి సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక వైద్యులు కిడ్నీ రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ముఖ్యంగా రోగులు క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకొనే విధంగా, గ్రామ సచివాలయ సిబ్బందితో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందకపోతే తనకు ఫిర్యాదు చేయాలన్నారు. మండలంలో డయాలసిస్ చేయించుకొంటున్న 26మంది రోగులకు పౌష్టికాహారం, మందులు ఉచితంగా ఇవ్వడానకి ఏర్పాట్లు చేస్తునట్టు తెలిపారు. రామచంద్రాపురంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌కు తక్షణం మరమ్మతులు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తామన్నారు. కృష్ణా జలాలు వచ్చే జనవరి నుంచి ప్రతి ఇంటికి సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో తిరువూరు ఆర్డీవో కె.మాధురి, డీఎంహెచ్‌వో డా. సుహాసిని, గ్రామీణ నీటి సరఫరా సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎస్.విద్యాసాగర్, ఏఈ శ్రీలక్ష్మి, తహసీల్దార్ కె.లక్ష్మి, డాక్టర్లు దివ్యస్వాతి పాల్గొన్నారు.


డయాలసిస్ రోగిని పరామర్శిస్తున్న కలెక్టర్


వాటర్ ట్యాంక్ పరిశీలిస్తున్న కలెక్టర్


కృష్ణారావుపాలెంలో కృష్ణా జలాల పైపులైన్ పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

జీఎస్టీ తగ్గింపులను బొక్కేస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

ట్యాబ్లెట్ షీట్ రూ.90 మాత్రమే ఉంటోంది. కానీ రిటైల్ వ్యాపారులు రూ. 150లకు విక్రయిస్తూ ఆ ట్యాబ్లెట్ షీట్ మీద రూ. 60 లాభం పొందుతున్నారు. ఇందులో కొనుగోలుదారులకు రూ.35 వరకు ప్రయోజనం దక్కాల్సి ఉన్నా దక్కటం లేదు. డయటాల్ క్యాప్స్ పాత ఎంఆర్‌పీ రూ. 125 కాగా, కొత్త ఎంఆర్‌పీ రూ.111.23గా ఉంది. లైజోఫోర్స్ 600 ట్యాబ్లెట్స్ పాత ఎంఆర్‌పీ రూ.399,39 కాగా, కొత్త ఎంఆర్‌పీ రూ.374.43 గా ఉంది. ఇలా పలు రకాల మందుల మీద కేంద్రం తగ్గించిన జీఎస్టీ మినహాయింపులను రిటైల్ వ్యాపారులకు అందిస్తున్నారు. కానీ రిటైల్ వ్యాపారులు మాత్రం నూటికి 90 శాతం పైగా ఎక్కడా జీఎస్టీ ప్రయోజనాలను తమ దగ్గర మందులను కొనుగోలు చేసే వారికి అందించటం లేదు. మెడికల్ హోల్‌సేల్ ఏజెన్సీల నుంచి కొత్త ఎంఆర్‌పీల మేరకు మందులను కొనుగోలు చేస్తున్నప్పటికీ, ఇంకా పాత ఎంఆర్‌పీ ధరలకే విక్రయిస్తున్నారు. మందులకు సంబంధించిన జీఎస్‌టీలో ప్రభుత్వం 18 శాతం నుంచి 5 శాతం, 12 శాతం నుంచి 5 శాతం మార్పు చేసింది. దీంతో కొనుగోలుదారుల మీద మందుల భారం తగ్గుతుందనుకుంటే.. రిటైల్ వ్యాపారుల నిర్వాకం వల్ల అది నెరవేరటం లేదు.

పట్టించుకునే నాథుడు కరువు!

జీఎస్టీ ప్రయోజనాలు మందుల కొనుగోలుదారులకు దక్కుతున్నాయా లేదా అని తెలుసుకొనే వ్యవస్థలు కానీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ చేసే వ్యవస్థలు కానీ లేవు. జీఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏనాడో చేతులెత్తేసింది. కనీసం రాష్ట్ర స్థాయిలో ఉన్న విజిలెన్స్ విభాగం అయినా మెడికల్ షాపులపై దాడులు జరుపుతుందా అంటే అదీ లేదు. కొనుగోలుదారుల ప్రయోజనాలను వ్యాపారులు బొక్కేస్తుంటే ఏ వ్యవస్థ కూడా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీనిపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుంతల కారిడార్!

(5వ పేజీ తరువాయి)

తయారైంది. ఎన్‌హెచ్-16లో భాగంగా నిడమానూరు నుంచి రామవరప్పాడుకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం విస్తరించి ఉంది. ఈ నాలుగు కిలోమీటర్లు ప్రయాణించాలంటే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా రామవరప్పాడులోని మహంకాళి అమ్మవారి గుడి వద్ద నుంచి ఎనికేపాడు వరకు అయితే రోడ్డుపై గోతులు ఉన్నాయా.. గుంతల్లో రోడ్డు ఉందా అన్నట్టు కనిపిస్తుంది. కొన్ని చోట్ల ఈ గోతులను రాళ్లతో పూడ్చడం గమనార్హం. అర అడుగు లోతు గోతులతో వాహనాలు కదలడానికి అష్టకష్టాలు పడాల్సిందే. కొన్ని చోట్ల పది అడుగుల వెడల్పుతో భారీ గోతులు ఉన్నాయి. ఈ గోతులను తప్పించలేక వాటి గుండా ప్రయాణించలేక భారీ వాహనాలు నెమ్మదిగా వెళ్తుండడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతోంది. కార్లు, ఆటోలు ఈ పెద్ద గుంతల్లో దిగే సమయంలో వాహనం కింద భాగం రోడ్డుకు తాకుతున్నాయి. దీంతో వాహనం ఆగిపోతుందేమోనన్న భయంతో వాటిని నడపలేక విడిచిపెట్టలేక వెళ్తున్నట్టు కనిపిస్తుంది చూసిన వారికి.

వర్షాకాలం మరింత ప్రమాదకరం

వర్షాకాలంలో ఈ నాలుగు కిలోమీటర్ల ప్రయాణం మరీ దారుణంగా ఉంటుంది. రోడ్డేదో, గుంతేదో తెలీక వాహనాలు ప్రమాదానికి గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే నాయకులు, ఇతర ప్రముఖులు ఈ మార్గంలో వెళ్తున్నప్పుడు వారికి ఇంత పెద్ద గోతులు కనిపించడం లేదా? కనిపించినా ఈ ఒక్కసారే కదా వచ్చేది అని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా అనే ప్రశ్నలు స్థానికుల్లో ఉత్పన్న మవుతున్నాయి. ప్రముఖులు ప్రయాణించే రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే ఇక మామూలు రోడ్ల పరిస్థితి ఏంటని వాహనచోదకులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి కాని రోడ్డు పరిస్థితి మారడం లేదని విమర్శిస్తున్నారు.

జోరుగా పేకాట!

(5వ పేజీ తరువాయి)

శిబిరాలపై దాడులు చేసేందుకు బయలుదేరిన వెంటనే సమాచారం ఈ పోలీస్ అధికారికి అందేలా ఏర్పాట్లు చేసుకుని మరీ పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి 11 గంటలకు ప్రారంభించి తెల్లవారుజామున నాలుగు గంటలకు పేకాట శిబిరాన్ని నిలిపివేయాలని ఈ పోలీస్ అధికారి సూచనలు చేస్తున్నారని, ఇందుకు పెద్దమొత్తంలో రోజువారీగా మామూళ్లు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మంగళగిరిలోని పోలీస్ ఉన్నతాధికారి కార్యాలయంలో పనిచేసే ఒక పోలీస్ కానిస్టేబుల్ మూడు రోజుల క్రితం జరిగిన పేకాట శిబిరంలో పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకోవడంతో పేకాట శిబిరాల నిర్వహణ వ్యవహారం ఎట్టకేలకు బయటకు వచ్చింది. విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం, గుంటూరు తదితర ప్రాంతాలకు చెందిన పేకాట రాయుళ్లకు సమాచారం అందించి, వారిని అక్కడకు రప్పించి పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారని స్థానిక గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లాకు కొత్త ఎస్పీ రావడంతో కొంతకాలం పాటు పేకాట శిబిరాలను నిర్వహించకుండా మిన్నకుండిపోయిన వ్యక్తులు మళ్లీ గత కొన్ని రోజులుగా పామర్రు నియోజకవర్గంలో రోజుకో గ్రామంలో పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కృష్ణా విశ్వవిద్యాలయం పీజీ ఎల్‌ఎల్‌ఎం ఫలితాలు వెల్లడి

మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లోని పీజీ ఎల్‌ఎల్‌ఎం 4వ సెమిస్టర్, ఎంటెక్ 2 సెమిష్టర్ పరీక్షా ఫలితాలను గురువారం పరీక్షల నియంత్రణ అధికారి డా. పి. వీరబ్రహ్మచారి ప్రకటించారు. పిజి ఎల్‌ఎల్‌ఎం 4వ సెమిస్టర్, ఎంటెక్ సెకండియర్‌లో నూరు శాతం ఫలితాలు సాధించారు.


ఆలయ పరిశుభ్రత, ప్రక్షాళన కార్యక్రమంలో పాల్గొని శుభ్రం చేస్తున్న చైర్మన్ బొర్రా రాధాకృష్ణ

దుర్గగుడిలో పరిశుభ్రత, ప్రక్షాళన

ఇంద్రకీలాద్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన పరిశుభ్రత, ప్రక్షాళన కార్యక్రమంలో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పాల్గొన్నారు. ఆలయాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, పవిత్రంగా ఉంచాలనే లక్ష్యంతో, శానిటేషన్ (పారిశుధ్య) సిబ్బందిని అన్నివిధాలా ప్రోత్సహించి, వారిలో స్ఫూర్తిని నింపేందుకు చైర్మన్ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. శానిటేషన్ సిబ్బందితో కలిసి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తులకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాలకమండలి సమావేశం

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానం పాలకమండలి సమావేశం శుక్రవారం వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి ప్రాంగణంలో జరగనుంది. పాలకమండలిని నియమించిన తరువాత తొలి సమావేశం జరగనుంది. దీనిలో భాగంగా ఇటీవల చైర్మన్ బి.రాధాకృష్ణ, పలువురు పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, లడ్డూ ప్రసాదం తయారీ భవనం, అన్నదాన విభాగాలతో పాటు కనకదుర్గానగర్‌లో దుకాణాలను పరిశీలించారు. సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై మూడు రోజుల నుంచి చైర్మన్, పాలకమండలి సభ్యులు కసరత్తు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరగనుంది.

ఆర్డీవో పేరుతో ఫేక్ అకౌంట్

» సైబర్ పోలీసులకు ఆర్డీవో ఫిర్యాదు

తిరువూరు : సైబర్ నేరగాళ్ల ఆగడాలు శృతిమించిపోతున్నాయి. ఏకంగా తిరువూరు ఆర్డీవో పేరుతో సోషల్ మీడియాలో ఫేక్ ఖాతాను తెరిచారు. 8553236906 నంబరుకు నగదు పంపాలని సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలో పోస్టు చేస్తూ ఓ సందేశాన్ని పంపారు. ఈ నకిలీ ఖాతా వైనాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో కె.మాధురి ఏసీపీ, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి మోసపూరిత ఖాతాలతో ఎటువంటి సబంధం లేదని ఆమె ఓ ప్రకటనలో తెలిపారు.

కలెక్టరేట్‌కు ప్రభుత్వ కార్యాలయాల పంచాయితీ!

(5వ పేజీ తరువాయి)

గమనార్హం. విజన్-2045లో భాగంగా ఈ భవనంలోని గదుల్లో ఒకటి ఎంపీ విజిట్‌కు వచ్చినపుడు వాడతామని, మరో గదిని మంత్రులు వచ్చినపుడు ఉపయోగిస్తామనే సాకుతో ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీ చేయాలని చెప్పడం విశేషం. ఈ భవనంలోని మరో గదిని సీపీవో రాత్రి సమయంలోనూ ఇక్కడే నివాసం ఉంటూ ఉపయోగించుకుంటున్నాడని సీపీవో కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు. సీపీవో కార్యాలయంలోని పర్యాటక, సమాచారశాఖ కార్యాలయాలను ఖాళీ చేయాలనే ప్రతిపాదనలతో ఈ వ్యవహారం తేల్చాలని కలెక్టర్ డీఆర్వోకు ఇటీవల పురమాయించారు. సమాచారశాఖకు ట్రెజరీ కార్యాలయం వెనుక భాగంలో ఇచ్చిన భవనంలోని గదికి మరమ్మతులు చేయిస్తే ఉపయోగపడుతుందనే అంశంపై డీఆర్వో ఇటీవల ఇంజనీరింగ్ అధికారులను పిలిచి మాట్లాడారు. ఈ భవనానికి మరమ్మతులు చేసినా పనికిరాదని, నూతన భవనం నిర్మాణానికి రూ.50లక్షల వరకు ఖర్చు అవుతుందని ఇంజనీర్లు తేల్చిచెప్పారు.

తెలుసుకుందాం

లో బ్రిడ్జి

» 80 ఏళ్లుగా వన్‌టౌన్, టూ టౌన్ ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చే వారధి


వన్‌టౌన్‌లో 1943లో నిర్మించిన సి.రాజగోపాలాచారి లో బ్రిడ్జి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

ఎనిమిది దశాబ్దాల క్రితం వన్‌టౌన్, టూ టౌన్ ప్రాంతాల మధ్య రైల్వే ట్రాక్ కింద నిర్మించిన లో బ్రిడ్జి నాటి ట్రాఫిక్ కష్టాలను కళ్లకు కడుతుంది. 1940లోనే ఈ రెండు ప్రాంతాల మధ్య రాకపోకలు తీవ్రంగా స్తంభించిపోయేవని చరిత్ర స్పష్టం చేస్తోంది. కార్లు, బైకులు, లారీ, బస్సు ఆటో తదితర మోటారు వాహనాల సంఖ్య అతితక్కువగా ఉండే ఆ రోజుల్లో.. అంత ట్రాఫిక్ ఎక్కడ నుంచి వచ్చేది.. అనే అనుమానం నేటి తరానికి ఖచ్చితంగా వస్తుంది. ఈ రెండు ప్రాంతాల మధ్య వంతెనపై రైళ్ల రాకపోకలు నిత్యం సాగుతూండేవి. అప్పట్లో రోడ్డుపై వెళ్లే వాహనాలను ఆపేందుకు రైల్వే అధికారులు గేటు వేసేవారు. గేటు తీసిన కొద్ది సేపటికే మరో రైలు వచ్చేది. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనాలు రైల్వే ట్రాక్ దాటి సగం వరకు మాత్రమే వెళ్ల గలిగేవి. అప్పట్లో వాహనాలంటే గుర్రపు బగ్గీలు, ఎద్దుల బండ్లు, రిక్షాలు, సైకిళ్లు. వీటితోనే నాటి ప్రజలు వన్‌టౌన్- టు టౌన్‌కు రాకపోకల్లో ఇబ్బందులు పడేవారు. నేడు వస్త్రలత షాపింగ్ కాంప్లెక్స్ ఉన్న ప్రదేశంలో అప్పట్లో మునిసిపల్ కార్యాలయం ఉండేది. టూ టౌన్, ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలు మార్కెట్ అవసరాల కోసం వన్‌టౌన్‌కు చేరుకోవాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో తారాపేట ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించేంది.

1942లో బెజవాడ కమిషనర్‌గా నియమితులైన సి.నరసింహం ఈ కష్టాలకు చెక్ పెట్టారు. అప్పటి మునిసిపల్ చైర్మన్ సి.రాజగోపాలచారిని ఒప్పించి లో బ్రిడ్జి పనులకు ప్రతిపాదనలు తయారుచేశారు. అప్పట్లో పబ్లిక్ వర్క్స్ శాఖకు చెందిన జి.అబ్రహాం ఈ పనులకు ప్రత్యేక అధికారిగా పనిచేశారు. లో బ్రిడ్జి నిర్మాణానికి అయ్యే ఖర్చులో నాలుగో వంతు మునిసిపాలిటీ, మిగిలిన మొత్తం మద్రాసు ప్రభుత్వం చెల్లించాలని ప్రతిపాదన చేశారు. నగరానికి చెందిన క్రాంట్రాక్టర్ పచ్చా పాపయ్య నిర్దేశించిన గడువు లోగా.. అంచనా వ్యయం కంటే తక్కువ ఖర్చుతోనే లో బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి ఆహా అనిపించారు. 1943లో పూర్తైన ఈ నిర్మాణానికి సి.రాజగోపాలచారి లో బ్రిడ్జిగా నామకరణం చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్ 125, 134, 145
చికెన్ విత్ స్కిన్ 240
చికెన్ స్కిన్‌లెస్ 250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 585

ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రజాదర్బార్ నేడు

పెనమలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పోరంకిలోని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజాదర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్యే ప్రసాద్‌కు అర్జీలు అందజేయాల్సిందిగా కోరారు. రెవెన్యూ, ఫించన్లు, నివేశన స్థలాలు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు హాజరై ఎమ్మెల్యే సమక్షంలో అర్జీలకు పరిష్కారం చూపుతారన్నారు. ఈఅవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.



సాయి లక్ష్మీ, వరసిద్ధికను అభినందిస్తున్న హెచ్‌ఎం నాగేశ్వరరావు

ఉయ్యూరు జడ్పీ విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటలపోటీలు, నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌పోటీల్లో ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఆరో తరగతి విద్యార్థిని ఎం.సాయిలక్ష్మి 600 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి, శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విజయవాడలో జరిగిన ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ అండర్-14 విభాగంలో కె.వరసిద్ధిక జాతీయ స్థాయిలో ప్రథమస్థానం సాధించింది. విజేతలను ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు విజేతలను, వ్యాయాయ ఉపాధ్యాయులను అభినందించారు.



శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోజాగిరి ఉత్సవంలో ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు

సనాతన ధర్మ పరిరక్షణే శివశక్తి లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సనాతన ధర్మ పరిరక్షణకు శివశక్తి ఫౌండేషన్ కృషి చేస్తున్నదని ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు అన్నారు. కానుమోలు శివాలయంలో కార్తీకమాసం సందర్భంగా శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళ సురక్ష - గౌరవ్‌లో భాగంగా గురువారం నిర్వహించిన కోజాగిరి ఉత్సవాన్ని సర్పంచ్ ఎనికేపల్లి సీతమ్మతో కలిసి ప్రారంభించారు. విజయవాడలో నిర్వహించే శివశక్తి దశవర్ష విజయ శంఖారావం బహిరంగసభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నరసింహారావు, తట్టి వెంకట సుబ్బారావు, శ్రీదేవి, నూకల నవ్యశ్రీ, దావులూరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మహాసభ పోస్టరును ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

భవన నిర్మాణ కార్మికుల సంఘ మహాసభ ఈనెల 10న

పెనమలూరు : భవన నిర్మాణ కార్మిక సంఘం కృష్ణా జిల్లా మహాసభ ఈనెల 10వ తేదీన పోరంకి విజ్ఞాన్ భారత్ పాఠశాలలో జరుగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఖాశీం తెలిపారు. యనమలకుదురు సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులు కార్మికులందరికీ అందేట్లు చూడాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. మండల అధ్యక్షులు కె.ఆదినారాయణ, శాంతిరాజు, అప్పల రాజు పాల్గొన్నారు.

తాడిగడప జడ్పీ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

కానూరు : కానూరులోని సిద్దార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తాడిగడప జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గురువారం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రామంలో ప్రత్యేక సేవా శిబిరంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు వర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జె.శివరాంప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం కనకదుర్గ బహుమతులు అందజేశారు. పాఠశాలలో పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు.

బాపులపాడులో పంట నష్టం 1865 హెక్టార్లు

హనుమాన్‌జంక్షన్: మొంథా తుపాను కారణంగా బాపులపాడు మండలంలో 1,865 హెక్టార్లలో వరి, మినుము పంటలకు నష్టం సంభవించినట్లు మండల వ్యసాయాధికారి రంగనాథ్‌బాబు గురువారం తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలు మేరకు పంట నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు ఏవో తెలిపారు. వరి 1200 హెక్టార్లు, మినుము 865 హెక్టార్లలో పూర్తిగా దెబ్బతిన్నట్లు నివేదిక పంపించినట్లు ఏవో తెలిపారు.



రాష్ట్ర జట్టుతో క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి రాంబాబు

యోగ పోటీలకు విద్యార్థుల ఎంపిక

గన్నవరం :రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య యోగ అండర్ 14, 17 బాల, బాలికల ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే కృష్ణా జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి జి రాంబాబు గురువారం తెలిపారు. అండర్ 14 బాలికల జట్టు జె. హారిక,పి. పోషితా , టి సాయి దుర్గ సాత్విక, ఎం.పూజ్య శ్రీతా, ఆర్. కౌశిక ఎంపికయ్యారు. బాలుర విభాగంలో సీహెచ్ సురేంద్ర బాబు , కే. లోకేష్, ఎస్.చరణ్ దిలీప్, జె. జగదీష్ , పి. నవనీత్ , బి. సాత్విక్ లు ఎంపికయ్యారు. అండర్ 17 బాలికల విభాగంలో

ఎం.నవ్య శ్రీ, పి.గీతిక , జి. లోహిత, సీహెచ్.దీపిక , ఎల్ అను, కే. తాప్సీలు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో కే. గణేష్, జి. జీవన్ నాయక్, బి శ్యామ్ ప్రసాద్ ఏ. పి. ఆర్. , టి ఎబినేజర్, వి. కీర్తన సాయి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 23, 24 తేదీలలో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో కృష్ణా జట్టు పాల్గొంటాయాని రాంబాబు తెలిపారు. ఎంపికలను పూర్ణ చంద్రరావు, శిరీష, మల్లేశ్వరావు, సుశీల నిర్వహించగా, స్థానిక బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పార్వతి ప్రారంభించారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధి లిమ్రా కాలనీ, శ్రీరాములు వీధి ప్రాంతంలో రూ.65 లక్షల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రధాన డ్రైనేజీ నిర్మాణం అనంతరం లిమ్రా కాలనీలో మిగిలిన రోడ్లు, డ్రెయిన్లను వచ్చే వర్షాకాలం లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో యనమలకుదురు రోడ్ల స్థితి దారుణంగా ఉండేదని, తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ఒక్క ఏడాదిలోనే 70కిపైగా రోడ్లను వేయించిన విషయాన్ని గుర్తు చేశారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, కమీషనర్ షేక్ నజీర్, సంగెపు రంగారావు, స్థానిక టీడీపీ కూటమి నేతలు పాల్గొన్నారు.

కోలవెన్నులో డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

కంకిపాడు : కోలవెన్ను గ్రామంలో పంచాయతీ నిధులు రూ. 40 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ, వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. అవినీతి అక్రమాలతో దాచుకోవడం, దోచుకోవడం మినహా ఒక్క రోడ్డు అభివృద్ధి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుందన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో సుమారు రూ. 125 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. మరో రూ. 75 కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామన్నారు. రానున్న మూడు సంవత్సరాల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రధాన రహదారులు అంతర్గర రహదారులు నిర్మించి తీరుతామని భరోసా ఇచ్చారు. వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తాడిగడప మునిసిపాలిటీ లిమ్రా కాలనీలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఎంపీడీవో కార్యాలయం వద్ద వందేమాతర ఉద్యమం అవగాహన ర్యాలీలో పాల్గొన్న పంచాయతీ సిబ్బంది

వందేమాతర ఉద్యమంపై అవగాహన ర్యాలీ

ఉయ్యూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో శేషగిరిరావు ఆధ్వర్యంలో గురువారం వందేమాతర ఉద్యమంపై గురవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో శుక్రవారం ఉదయం సమావేశం ఏర్పాటు చేసి వందేమాతర ఉద్యమం విశిష్టతను తెలియజేసి వందేమాతర గీతాలాపన చేయాలన్నారు. భారత దేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని నిరూపిద్దాం అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు, ఏపీఎం అమరేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి లయన్స్ సహకారం

● వీరమాచినేని రామబ్రహ్మం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు లయన్స్ సహకరిస్తుందని జిల్లా మాజీ గవర్నర్ వీరమాచినేని రామబ్రహ్మం అన్నారు. హనుమాన్‌జంక్షన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పొణుకుమాడులో ఎంపీపీ స్కూల్ అభివృద్ధికి విరాళాన్ని గురువారం ఆయన అందజేశారు. ప్రతి ఏటా స్కూల్ అభివృద్ధికి తన వంతుగా విరాళం అందిస్తున్నానని, గ్రామాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తున్నట్లు వీరమాచినేని రామబ్రహ్మం తెలిపారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు హితవు పలికారు. అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తి, కార్యదర్శి మాకినేని శ్రీనివాసరావు, కోశాధికారి అక్కినేని రాఘవేంద్రరావు, గ్రామప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాళం అందజేస్తున్న లయన్స్ మాజీ గవర్నర్ రామబ్రహ్మం

కుందేరులో ఉచిత పశువైద్యశిబిరం

కంకిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కుందేరు గ్రామంలో బి.వి.రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పశు పోషణపై రైతులు ఆసక్తి చూపించాల్సిన అవసరముందన్నారు. కూటమి ప్రభుత్వం పశు పోషకులకు అనేక రాయితీలు కల్పిస్తుందన్నారు. కుందేరు సర్పంచ్ కె. రాధిక, పీఏసీఎస్ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, విజయ డెయిరీ కుందేరు అధ్యక్షుడు టి. నరేష్ రెడ్డి, చంద్రమోహన్, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

● హెచ్‌ఎం చోరగుడి అనిత



ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌లో ఏకరూప క్రీడాదుస్తులు ధరించిన విద్యార్థులతో దాత పద్మజ, హెచ్‌ఎం అనిత, పీడీ కాంతి

ఉంగుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు వుంటుందని ఉంగుటూరు జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం చోరగుడి అనిత అన్నారు. పాఠశాలలో పీఎస్ టీచర్‌గా పనిచేస్తున్న కోసూరు పద్మజ, తన భర్త శ్రీనివాస్, కుమారులు అభిరామ్, అనిరుధ్‌లు 22 మంది క్రీడాకారులకు ప్రోత్సాహకంగా రూ.10 వేల విలువగల స్పోర్ట్స్ యూనిఫాం బహూకరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని, క్రీడా నైపుణ్యం పెంపొందించుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. క్రీడా దుస్తులు బహూకరించిన కోసూరు పద్మజ, కుటుంబసభ్యులను హెచ్‌ఎం అభినందించారు. పీడీ ఎస్.కాంతి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవలో రెవెన్యూ అధికారులు

● కాల్వగట్ల నివాసితులకు వస్త్రాల పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి) : వీరవల్లిలోని ఏలూరు కాలువ గట్లపై నివశిస్తున్న నిరుపేద కుటుంబాలకు రెవెన్యూ అధికారులు నూతనవస్త్రాలను అందజేశారు. తహసీల్దార్ మురళీకృష్ణ, వీఆర్వో సునీల్‌కుమార్ తమ సొంత నిధులతో నూతన వస్త్రాలను గురువారం పంపిణీ చేశారు. వలస కార్మికులైన 12 కుటుంబాలలోని సభ్యులందరికీ నూ తన వస్త్రాలను సర్పంచ్ పిల్లా అనిత, తెలుగురైతు నాయకుడు గుండపనేని ఉమావరప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కలపాల నాని, టీడీపీ నాయకులు కలపాల రాజాబాబు, అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర, లంక అజయ్, పిల్లా రామారావు, ఈవో హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వలసకార్మిక కుటుంబాలకు తహసీల్దార్ మురళీకృష్ణ, వీఆర్ఓ సునీల్‌కుమార్ అందజేసిన నూతనవస్త్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ అనిత, ఉమావరప్రసాద్, తదితరులు

విద్యార్థులకు లిటిల్‌హార్ట్స్ చిత్రం ప్రదర్శన

హనుమాన్‌జంక్షన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కెఎస్ టాకీస్ థియేటర్‌లో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు లిటిల్ హార్ట్స్ లఘు చిత్రాన్ని గురువారం బెనిఫిట్ షో ప్రదర్శించారు. జిల్లా జాయిం ట్ కలెక్టర్ ఆదేశాలు మేరకు ఓ ప్రైవేట్ సంస్థ విద్యార్థులకు సబ్సిడీపై టిక్కెట్ ధర రూ.30 చిత్రాన్ని ప్రదర్శించగా బాపులపాడు జడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూల్ విద్యార్థులు తిలకించారు. హైస్కూల్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షణలో పాఠశాల ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని విద్యార్థులకు చిత్రాన్ని చూపించారు. స్వశక్తితో ప్రతి వ్యక్తి జీవితంలో ఆర్థికంగా ఏ విధంగా అభివృద్ధి చెందవచ్చో తెలిపే సారాంశంతో చిత్రం ఉన్నట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు వివరించారు. విద్యార్థులకు బాగా ఉపయోగపడుతుందని వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ఉయ్యూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. కాటూరు, ముదునూరు, బోళ్లపాడు రైతు సేవా కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో తేమశాతం, రైస్ మిల్లుల వద్ద తేమశాతం తేడా ఉంటోందని, మిల్లుల వద్ద తేమశాతం ఎక్కువ ఉన్నట్టు చూపించి గత సంవత్సరం మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేశారని కా టూరు రైతు వేమూరు శ్రీనివాసరావు, పలుపురు రైతులు జేసీ దృష్టికి తీసు కువచ్చారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ ఆదేశించారు. ఆర్డీవో హేలాషారోన్, తహసీల్దార్ సురేశ్‌కుమార్, సివిల్ సప్లైస్ డీటీ ప్రధాన్, మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్ పాల్గొన్నారు.



కాటూరు ఆర్‌ఎస్‌కెలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న జేసీ ఎం నవీన్



వీరవల్లి పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ కలపాల నాని, ఉపసర్పంచ్ లంక అజయ్, టీడీపీ నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ ఛైర్మన్ కలపాల నాని అన్నారు. . వీరవల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలను పాటిస్తూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి మద్దతుధర పొందాలని సూచించారు. ధాన్యం వివరాలు నమోదు చేసుకునేందుకు 7337359375 వాట్సాప్ నెంబరును వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు చేసిన గంటల వ్యవధిలోనే రైతు ఖాతా లో నగదు పడుతుందన్నారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, ఉపసర్పంచ్ లంక అజయ్, వీఆర్వో అట్లూరి సునీల్‌కుమార్, పిల్లా రామారావు, టీడీపీ నాయకులు మండాది రవీంద్ర, అనంద్, రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రా కురియన్ మండవ

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా 27 ఏళ్లపాటు సుదీర్ఘకాలం జానకిరామయ్య సేవలు

● సొంతగ్రామంలో విషాదచాయలు ● తరలివచ్చిన రైతులు, ప్రజలు, ప్రముఖులు ● అల్లాపురం శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి






జానకిరామయ్య పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, టీడీపీ నేత గుడిపూడి తులసీమోహన్, జానకి రామయ్య అంతిమయాత్ర

గన్నవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ 2వ చైర్మన్ మండవ జానకి రామయ్య (94) గన్నవరం మండలం చిన అవుటపల్లి రుషివాటికలో తన స్వగృహంలో గురువారం ఉదయం కన్నుమూశారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. విజయడెయిరీకి 27 ఏళ్లపాటు చైర్మన్‌గా పనిచేశారు. ఏపీడీసీసీఎఫ్‌కు ఐదేళ్లు పాటు చైర్మన్‌గా ఉన్నారు. 1992లో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జానకిరామయ్య సంస్థను అభివృద్ధి పథంలోకి నడిపించేందుకు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని లాభాల్లోకి తీసుకువచ్చారు. రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారు. 2009 నుంచి ఏడాదికి 3 సార్లు చొప్పున రైతులకు రూ.60కోట్లు పైనే బోనస్ పంపిణీ చేశారు. జానకి రామయ్య సేవలను గుర్తించిన ఇండియన్ డైయిరీ అసోసియేషన్ వర్గిస్ కురియన్ అవార్డుతో సత్కరించింది. ఆయనను ఆంధ్రా కురియన్‌గా పిలుస్తారు. స్వస్థలం మొవ్వ అయినప్పటికీ విజయడెయిరీ చైర్మన్ అయిన తరువాత చిన అవుటపల్లి రుషివాటిలోకి వచ్చారు. ఆయన కన్నుమూశారన్న సమాచారంతో మొవ్వతో పాటు పామర్రు, తోట్లవల్లూరు మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, విజయడెయిరీ అధికారులు, సిబ్బంది, నియోజకవర్గం ప్రముఖులు పార్థివదేహాన్ని సందర్శించారు. కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్ రాజా, కామినేని శ్రీనివాస్, మాజీ మంత్రి వడ్డే శోభానాద్రీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, విజయడెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, యార్లగడ్డ సతీష్, వీరపనేని శివరామ్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, విజయడెయిరీ ఎండీ కొల్లి ఈశ్వర్‌బాబు, పాలకవర్గ సభ్యులు, టీడీపీ మండలాధ్యక్షులు గూడపాటి తులసీమోహన్, పాలడుగు నాని, గొంది నరేంద్ర, నర్రా సీతారామారావు, సజ్జ శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అల్లాపురం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



జానకిరామయ్య మృతి తీరనిలోటు: చలసాని

కృష్ణా మిల్క్ యూనియన్ మాజీ చైర్మన్ మండవ జానకి రామయ్య మృతి రాష్ట్రానికి తీరని లోటని సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. తెలుగు ప్రజలకు ఆయన గర్వకారణంగా నిలిచారన్నారు. సుదీర్ఘకాలం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించి సంస్థను ప్రగతి పథంలో నడిపి చెరగని ముద్ర వేశారన్నారు. ఆదర్శవంతమైన జీవితం యువతకు స్ఫూర్తి అని ఆయన బాటలోనే సాగుతూ సంస్థను అభివృద్ధి పథంలోకి నడిపిస్తామన్నారు.



రైతులకు ధైర్యం, స్ఫూర్తి: మాజీ మంత్రి దేవినేని

గొల్లపూడి: విజయ డెయిరీ చైర్మన్‌గా సుదీర్ఘకాలం పనిచేసి ఆ సంస్థను అత్యున్నత స్థాయిలో నిలబెట్టిన ఘనత మండవ జానకి రామయ్యదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన ఉమ గొల్లపూడి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జానకిరామయ్య మృతి కృష్ణాజిల్లాకే కాకుండా యావత్ పాడి పరిశ్రమ రైతులకు తీరని లోటని వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విజయ డెయిరీని సంక్షోభం నుంచి గట్టెక్కించి రూ.1000 కోట్ల టర్నోవర్‌కు చేర్చిన ఘనత ఆయనదన్నారు. వందల లీటర్లతో ప్రారంభించిన సంస్థను 4 లక్షల లీటర్లకు తీసుకువెళ్లిన ఆయన కృషి గుర్తింపుగా అనేక అవార్డులు పొందారన్నారు.

గ్రామస్థుల విచారం

కూచిపూడి: మొవ్వ గ్రామానికి చెందిన మండవ జానకి రామయ్య మృతి పట్ల గ్రామస్థులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 1981లో గ్రామసర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 1981 నుంచి 87 వరకు సర్పంచ్‌గా పని చేశారు. సుదీర్ఘకాలం పాటు మొవ్వ పాల సొసైటీ అధ్యక్షుడిగానూ పనిచేశారు. మొవ్వలో ప్రాథమిక విద్యతోపాటు స్థానిక జడ్పీ పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సీ విద్యనభ్యసించారు. మొవ్వ జడ్పీ పాఠశాల, క్షేత్రయ్య జూనియర్ కళాశాల సంస్థల నిర్మాణంతోపాటు వేమూరి సుందరామయ్య ఆర్థిక సహకారంతో వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశా ల, ప్రవాస భారతీయులు మండవ బాబూరావు ఆర్థిక సహకారంతో గ్రామపంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు, కో-ఆపరేటివ్ బ్యాంక్, ఆర్టీసీ బస్టాండ్ స్థాపనకు కృషి చేశారు. సుమారు 2దశాబ్దాల క్రితం గ్రామంలో క్షేత్రయ్య కళ్యాణ మండప నిర్మాణం చేపట్టారు. మాజీ సీఎం ఎన్టీఆర్ నుంచి, నేటి సీఎం చంద్రబాబు వరకు అందరితో సన్నిహితంగా మెలిగారు. మొవ్వలో 21 ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటులో జానకి రామయ్య కృషి ఎంతగానో ఉంది.

గన్నవరం తరలివెళ్లిన గ్రామస్థులు

జానకి రామయ్య వంశీకులు, గ్రామస్థులు ఆయన అంత్యక్రియల్లో పాల్గొనేందుకు గురువారం గన్నవరం తరలివెళ్లారు. తాతినేని పూర్ణచంద్రరావు, మండవ రత్నగిరిరావు, మండవ కోటేశ్వరరావు, కాకాని పూర్ణచంద్రరావు, మండవ వెంకట్రావు, పిచ్చేశ్వరరావు, మండవ శ్రీ కృష్ణ, మండవ వెంకటేశ్వరరావు, పాల సొసైటీ అధ్యక్షులు మండవ కోటేశ్వరరావు, శీలం బాబురావు, ఈడే నాగేశ్వరరావు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



వీఎస్ఆర్ కళాశాలలో నివాళులు

మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు జానకి రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యావ్యాప్తికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ప్రిన్సిపల్ ఎస్ మాధవి పాల్గొన్నారు.



వెన్యు కారును విడుదల చేసిన క్రైమ్ డీసీపీ రాజారావు, చిత్రంలో సాయి స్వర్ణ జనరల్ మేనేజర్ భగత్ సింగ్ తదితరులు

మార్కెట్లోకి సరికొత్త వెన్యు కారు విడుదల

ప్రసాదంపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూతన వెన్యు కారు రూ.7.89 లక్షల నుంచి లభిస్తుందని సాయి స్వర్ణ జనరల్ మేనేజర్ భగత్ సింగ్ అన్నారు. గురువారం రామవరప్పాడులోని సాయి స్వర్ణ హ్యుందాయ్ షోరూమ్‌లో క్రైమ్ డీసీపీ ఎం రాజారావు సరికొత్త వెన్యు కారును మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ మాట్లాడుతూ నూతన వెన్యు కారు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రత సౌకర్యాలు, ఆకర్షణీయమైన రంగులలో లభిస్తుందన్నారు. ఇది పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో మాన్యువల్, ఆటోమేటిక్ ఇంజన్లతో అందుబాటులో ఉందని వెల్లడించారు. హ్యుందాయ్ మోటార్ ఇండియా టీఎస్ఎం ధీరజ్, హ్యుందాయ్ ఇన్సూరెన్స్ టీఎస్ఎం నాగేశ్వరరావు, సాయి స్వర్ణ సీఈవో రఫీ, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

రెవెన్యూ వసూళ్లు వందశాతం సాధించాలి

● లో ఓల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలి
● ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

విజయవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ వసూళ్లను వందశాతం సాధించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పీ పుల్లారావు అధికారులను ఆదేశించారు. నగరంలోని స్థానిక పీడబ్ల్యూడీ గ్రౌండ్ వద్ద ఉన్న ఏపీసీపీడీసీఎల్ సర్కిల్ ఆఫీస్‌లో గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్ఈలు, ఈఈలతో పీఎం సూర్యఘర్, రెవెన్యూ కలెక్షన్స్, సైక్లోన్ డ్యామేజీ, ఆర్డీఎస్ఎస్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్తును అందిస్తూ ఎక్కడైనా లో ఓల్టేజ్ సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీపై అవగాహన కల్పించి, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, టీవీఎస్ఎన్ మూర్తి, వెంకటేశ్వర్లు, సీజీఎం పాల్గొన్నారు.

కులదూషణ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

మచిలీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌ను కులం పేరుతో దూషించిన కేసులో ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో వారికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ ఎస్సీఎస్టీ కేసుల ప్రత్యేకకోర్టు న్యాయమూర్తి బాబునాయక్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2018లో నాగాయలంకలో బోగాధి శివవిష్ణువర్ధన్, అశోక్ మద్యం మత్తులో స్థానికులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే సమాచారంతో నాగాయలంక పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సమయంలో విధుల్లో ఉన్న కర్రా కల్యాణ్ అనే కానిస్టేబుల్‌ను పోలీస్‌స్టేషన్‌లోనే కులంపేరుతో దూషించారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదుమేరకు నాగాయలంక పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో ఇరువురు నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.



స్మృతివనాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

విజయవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ స్మృతివనాన్ని వ్యాపార కేంద్రంగా కాకుండా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అన్నారు. దళిత, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కులవివక్ష వ్యతిరేక పోరాటసంఘం (కేవీపీఎస్) రౌండ్‌టేబుల్ సమావేశం మాల్యాద్రి అధ్యక్షతన గురువారం నగరంలోని బాలోత్సవ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మృతివనం నిర్మాణ, నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. పర్యవేక్షణకు ప్రభుత్వాధికారులు, పౌరసంస్థల ప్రతినిధులతో నిర్వహణ కమిటీ ఏర్పాటుచేసి, యువత, చిన్నపిల్లలను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దళిత, గిరిజన ప్రజా సంఘాల నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మీ వాహన టైర్లు సురక్షితమేనా!

ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల్లో వాహనాల ప్రమాదాల వీడియోలూ ఉన్నాయి. వర్షంలో రోడ్లపై వాహనాలు అదుపుతప్పి గింగరాలు తిరుగుతూ, పల్టీలు కొట్టే వీడియోలు కొన్నయితే బ్రేక్ వేసినా ఆగకుండా వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టే వాహనాల దృశ్యాలు కొన్ని. ఇలాంటి ప్రమాదాలు జరగడానికి కారణాలు అనేకం ఉన్నా వాటిలో ముఖ్యమైనది మాత్రం వాహనాల టైర్ కండిషన్ ఒకటని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ వర్షాకాలంలో వాహనాల టైర్లు సరిగా లేక జరిగే ప్రమాదాలను నివారించాలంటే టైర్ల గురించి, వాటి నిర్వహణ గురించి తెలుసుకోవాల్సిందే.

- మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి

● వర్షాలు పడుతున్నప్పుడు టైర్ల వినియోగంలో జాగ్రత్తలు అవసరం



ద్విచక్రవాహనమైనా కారైనా లారీ, బస్సు అయినా రోడ్డుపై సురక్షితంగా ప్రయాణం చేయాలంటే మంచి టైర్లు ఉండాలి. ఆకస్మాత్తుగా కురిసే వర్షాల కారణంగా గుంతలు పడిన రోడ్లపై ప్రయాణం అంత సులువేం కాదు. ఒక మోస్తరు, భారీ వర్షం పడినప్పుడు నేత లంతా బురదగా మారుతుంది. ఈ పరిస్థితుల్లో వాహనం స్కిడ్ అవ్వొచ్చు. బ్రేక్ వేసినా ఆగకకపోవచ్చు వీటికి కారణం వాహనం టైరు సరైన కండిషన్‌లో లేకపోవడమే. తడి రోడ్లు ఘర్షణ లేని ఉపరితలంగా పనిచేస్తాయి. రహదారిపై వాహనం పట్టును తగ్గిస్తాయి. వర్షాకాలంలో రోడ్డెక్కే ప్రతి వాహన యజమాని ముందు తన వాహనం టైర్ల కండిషన్ చూసుకోవాలి. టైర్లలో ప్రెజర్, ట్రెడ్ తనిఖీ చేసే పరికరాలు ఉంచుకోవాలి. అరిగిపోయిన, గట్టిపడిన టైర్లతో వర్షాకాలంలో రోడ్లపై ప్రయాణమంటే ప్రమాదాలను ఆహ్వానించడం.. ప్రాణాలను పణంగా పెట్టడమే. అందుకే వర్షాకాలంలో వాహనదారులు టైర్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనల గురించి టైర్ల రంగంలో రెండు దశాబ్దాల పైగా అనుభవం ఉన్న సాయి దుర్గా వీల్ టెక్ నిర్వాహకుడు ఏ శివయ్య చెబుతున్న టిప్స్.. మీ కోసం.

టైర్ బటన్

వర్షాకాలంలో టైర్ బటన్ (ట్రెడ్) కీలకం. బటన్ లోతుగా ఉండాలి. వర్షంలో ప్రయాణం చేసేటపుడు రోడ్డుపై నీరు టైరు బటన్ మధ్య వ్యాప్తికి ఆస్కారం ఉంటుంది. అదే సురక్షితమైనది. బటన్ తక్కువగా ఉన్న టైర్లలో వర్షం నీటి వ్యాప్తికి స్థలం లేక బ్రేక్ వేసినపుడు స్కిడ్ అవడం, రోడ్డుపై జారిపోవడం జరుగుతుంది. దీని వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది.



3 మిల్లీమీటర్ల ట్రెడ్ ఉండాలి

వర్షాకాలంలో మీ వాహనం టైరు బటన్ (ట్రెడ్) కనీసం 1.6 మిల్లీమీటర్ల లోతు ఉండాలి. నీటివ్యాప్తిని పట్టును పెంచడానికి 3 మిల్లీమీటర్లు లేదా అంత కంటే ఎక్కువ బటన్ ఉంటే ఇంకా మంచిది. ఇందుకోసం టైర్‌ట్రెడ్ వేర్ ఇండికేటర్స్ లేదా రూపాయి నాణెంతో ట్రెడ్ డెప్త్ తనిఖీ చేసుకోవచ్చు.

టైర్ ప్రెజర్

వర్షాకాలంలో మీ వాహనం టైర్‌ను



కంపెనీ నిబంధనల ప్రకారం తెలిసిన ప్రెజర్ ఉండేలా చూసుకోవాలి. సరైన ప్రెజర్ ఉన్న టైరు రోడ్డు ఉపరితలంతో సరైన బంధం కొనసాగిస్తుంది. దీని వల్ల రోడ్డుపై గ్రిప్ ఉంటుంది.

టైర్ రోటేషన్

వర్షాకాలంలో టైర్లను నిపుణులతో తనిఖీ చేయించాలి. టైర్ల అరుగుదలలో ఎక్కువ తక్కువ ఉంటే బ్రేకింగ్‌లో తేడాలు వస్తాయి. అందుకే నిపుణుల సలహా మేరకు టైర్లను రోటేషన్ విధానంలో మార్చాలి. ఒక్కోసారి 5వేల కిలోమీటర్లకు ఒక సారి మార్చాల్సి వస్తుంది. దీంతో అన్ని టైర్లు సమాన అరుగుదలను నమోదు చేస్తాయి. వాహనం రోడ్డుపై స్థిరంగా ప్రయాణించడానికి వీలవుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..!

- వాహన తయారీ కంపెనీలు వాహన సామర్థ్యానికి తగిన టైర్లను ఇస్తాయి. టైర్లను మార్చాల్సి వస్తే అదే సామర్థ్యం ఉన్న టైర్లనే వేసుకోవాలి.
- కొత్త టైర్లు వేసేటపుడు తయారీ తేదీ నుంచి ఏడాది లోపు ఉన్నవి కొనుగోలు చేయాలి.
- వాహన మోడల్, ఇంజన్ సామర్థ్యం, బరువును బట్టి టైర్ల వినియోగం సాధారణ వాహనాలకు 40 వేల కిలోమీటర్ల వరకు పరిమితి ఉంటే హై ఎండ్ వాహనాలకు 20వేల కిలోమీటర్ల వరకు మాత్రమే పరిమితి ఉంటుంది. పరిమితికి మించి టైరు వాడకం మంచిది కాదు. అరిగిపోయిన టైర్లు రోడ్డుపై గ్రిప్ ఇవ్వవు.
- నిర్ణీత కిలోమీటర్లు తిరిగినా తిరగకపోయినా 4 ఏళ్ల తరువాత టైరు మార్చాలి. ఎందుకంటే టైరు హార్డు అయితే రోడ్డుపై గ్రిప్ ఉండదు.
- గతుకుల రోడ్లు, మట్టి రోడ్లు, రాళ్లు తేలిన రోడ్లు, తడి, మంచు ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా తిరిగే వాహనాల టైర్లను ప్రతివారం రోజులకు ఒకసారి పరీక్షించుకోవాలి. ఈమార్గంలో తిరిగే వాహనాల టైర్ల ఉపరితలం, పక్కభాగం దెబ్బతినే ఆస్కారం ఉంటుంది.

పండుగలకు అదనపు రైలు సర్వీసులు

రైల్వేస్టేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పండుగల సీజన్ సందర్భంగా ప్రయాణికుల రద్దీ నియంత్రించేందుకు వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 08551 అరకు - ఎల్హంక ఈనెల 13, 23న రెండు సర్వీసులు నడుస్తుంది. 08552 ఎల్హంక - అరకు ఈనెల 14, 24న రెండు సర్వీసులు నడుస్తుంది. 08555 అరకు - ఎల్హంక ఈనెల 17, 24న రెండు సర్వీసులు, 08556 ఎల్హంక - అరకు ఈనెల 18, 25న రెండు సర్వీసులు నడుస్తాయి. 08553 శ్రీకాకుళం రోడ్డు - బెంగళూరు కంటోన్మెంట్ ఈనెల 21న ఒక సర్వీసు, 08554 బెంగళూరు కంటోన్మెంట్ - శ్రీకాకుళం రోడ్డు ఈనెల 24న ఒక సర్వీసు చొప్పున నడుస్తుంది. 08463 భువనేశ్వర్ - బెంగళూరు కంటోన్మెంట్ ఈనెల 16న ఒక సర్వీసు, 08464 బెంగళూరు కంటోన్మెంట్ - భువనేశ్వర్ ఈనెల 20న ఒక సర్వీసు చొప్పున నడుస్తాయి.

చంబల్‌పూర్ - బెంగళూరు కంటోన్మెంట్ ప్రత్యేక రైలు

08335 చంబల్‌పూర్ - బెంగళూరు కంటోన్మెంట్ రైలు చంబల్‌పూర్‌లో ఈనెల 20న బయలుదేరుతుంది. అనకాపల్లి, గుంటూరు, నరసరావుపేట, మార్కాపూర్ రోడ్డుకు మీదుగా బెంగళూరు వెళుతుంది. తిరిగి 24న బెంగళూరు నుంచి బయలుదేరే ఇదే రైలు మార్కాపూర్ రోడ్డు, నరసరావుపేట, గుంటూరు, అనకాపల్లి మీదుగా చంబల్‌పూర్ వెళుతుంది. 08445 కటక్ - బెంగుళూరు కంటోన్మెంట్ ఈనెల 21న కటక్‌లో బయలుదేరుతుంది. 08446 బెంగళూరు కంటోన్మెంట్ - కటక్ రైలు బెంగళూరు కంటోన్మెంట్‌లో 25న బయలుదేరుతుంది.

రాష్ట్రస్థాయి పోటీలకు పులిగడ్డ గురుకుల విద్యార్థుల ఎంపిక



అవనిగడ్డ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4న గుడివాడ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ సెలక్షన్స్ నందు పులిగడ్డ గురుకుల పాఠశాల విద్యార్థులు బి.ఏలిషా 1500 మీటర్ల రన్‌లో ప్రథమ, ట్రిపుల్ జంప్‌లో ప్రథమ, ఆర్.వరుణ్ 400 మీటర్ల రన్‌లో ప్రథమ, లాంగ్ జంప్‌లో ప్రథమ, ఏ.ప్రశాంత్ 5కిలోమీటర్ల వాక్‌లో ప్రథమ, అఖిల్ 1500 మీటర్ల రన్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ కె.జాన్ తెలిపారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలియజేస్తూ విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీఈటీ జి.వీరకుమార్‌ను అభినందించారు.

రాష్ట్ర కబడ్డీ పోటీలకు తలగడదీవి, ఏటిమొగ విద్యార్థులు




నాగాయలంక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో నిర్వహించే కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు తలగడదీవి, ఏటిమొగ జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపిక య్యారు. ఈ నెల 5వ తేదీన వెన్ననపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కబడ్డీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో సెలక్షన్లు జరిగాయి. మండలంలోని తలగడదీవి, ఏటిమొగ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక అయ్యారు. బాలుర విభాగంలో నాయుడు అనిల్ కుమార్, జిన్నాబత్తిన కార్తీక్ బాలికల విభాగంలో కేసాని మౌనిక, తోట కీర్తన, జూనియర్ కో-కో సెలక్షన్స్‌లో బాలికల విభాగంలో ఇమ్మడి కావ్యశ్రీ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండ్రెడ్డి శివరామ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వర్రే రాంబాబు, పిడి బిపిఎల్.ప్రసాద్, విద్యా కుటుంబం అభినందించారు. ఏటిమొగ జడ్పీ పాఠశాల నుంచి టి.నాగ చైతన్య, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు.

బంగారం పేరుతో మోసం, ఇద్దరిపై కేసు

విద్యాధరపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన ఇద్దరిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంకు చెందిన కిలారి బ్రహ్మయ్య ఇంటివద్దే హోటల్ నడుపుకుంటున్నాడు. ఇతడికి ఏడాది క్రితం వంశీ అనే వ్యక్తితో పరిచయమైంది. వంశీ తరచూ బ్రహ్మయ్య టిఫిన్ హోటల్ వద్దకు వెళుతూ ఉంటున్నాడు. ఈ క్రమంలో వంశీ 20 రోజుల క్రితం కిలారి బ్రహ్మయ్యకు ఫోన్ చేసి 100 గ్రాముల బంగారం రూ.8లక్షలకు ఇస్తామని చెప్పాడు. బాధితుడు ఎక్కడ తీసుకోవాలని అడగ్గా విజయవాడ వచ్చి ప్రసాద్ అనే వ్యక్తిని కలవమని నెంబరు ఇచ్చాడు. దీంతో బాధితుడు ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి ఈనెల 5న హైదరాబాద్ నుంచి రూ.8లక్షల నగదు బ్యాగ్‌లో భద్రపరచుకుని గొల్లపూడి సమీపంలోని నల్లకుంట రోడ్డులోని వాసు గ్రూప్ ఆఫ్ కంపెనీ ఎదురుగా వెళ్లగా ప్రసాద్ కలిశాడు. అక్కడ ప్రసాద్ చిన్న బంగారం ముక్క శాంపుల్‌గా చూపించి, బాధితుడు నుంచి రూ.8లక్షలు తీసుకుని పోలీసు వ్యాన్ వస్తుంది నువ్వు ఇక్కడే ఉండు నేను వస్తానని చెప్పి పరారయ్యాడు. ఎంతసేపటికీ రాకపోవటంతో బాధితుడు ఫోన్ చేయగా నన్ను పోలీసులు పట్టుకున్నారు. నువ్వు అక్కడ నుంచి మీ ఊరు వెళ్లిపో ఫోన్ చేస్తానని ఫోన్ కట్ చేశాడు. దీంతో బాధితుడు ఫోన్‌లో వంశీకి చెప్పాడు. దీంతో వంశీ వరంగల్ పోలీసులు ప్రసాద్‌ను పట్టుకున్నారు, నీ డబ్బులు ఎక్కడిపోవు, వారంలో ఇస్తాం, ఎక్కడా అల్లరిచేయవద్దు అని చెప్పాడు. దీంతో బాధితుడు మోసపోయానని తెలుసుకుని భవానీపురం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు వంశీ, ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు.

నలుగురిపై కేసు

గొల్లపూడిలోని ఓ ప్రైవేటు కాలేజీలోకి దౌర్జన్యంగా వెళ్లి వైస్ ప్రిన్సిపాల్, కాలేజీ సిబ్బందిని కొట్టి, అసభ్యకరంగా దూషించిన నలుగురిపై గురువారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. గుంటుపల్లి లవకుశ అపార్టుమెంట్‌లో కనపర్తి ప్రవీణ్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఇతడు గొల్లపూడి వై జంక్షన్ మైలురాయి సమీపంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. అదే కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న శాంతాల భానుశేఖర్ సరిగా కాలేజీకి రావటం లేదని బాధితుడు కనపర్తి ప్రవీణ్ అడిగాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి భానుశేఖర్ తల్లి లక్ష్మీ మూలపాడుకు చెందిన అనిల్, సుదర్శన్, రామారావును వెంటబెట్టుకుని ఈనెల 3న కాలేజీకి దౌర్జన్యంగా వెళ్లి బాధితుడు, కాలేజీ సిబ్బందితో గొడవ పడ్డారు. అంతటితో ఆగకుండా ప్రవీణ్‌ని, కాలేజీ సిబ్బందిని చేతులతో కొట్టి చంపుతానంటూ దాడి చేయగా ప్రవీణ్ తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు లక్ష్మీ, సుదర్శన్, అనిల్, రామారావుపై కేసు నమోదు చేశారు.

తాపీ కార్మికుడి అదృశ్యం

రాణిగారితోటకు చెందిన తాపీ కార్మికుడు అదృశ్యమైనట్టు గురువారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. రాణిగారితోట చలసాని నగర్‌లో నివాసం ఉంటున్న ఒంటిపులి శివయ్య (42) తాపీ పనులు చేస్తూ భార్య, కుమార్తె, కుమారుడిని పోషిస్తున్నాడు. ఇతడు సెప్టెంబరు 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు ఇంటికి వెళ్లలేదు. దీంతో అతడి కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శివయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమంగా మా డబ్బులు తినేశారు.. తిరిగి ఇప్పించండి

సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా చేసిన జొన్నలవారిమోడి మహిళలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాళ్ళపాలెం శివారు జొన్నలవారిమోడి గ్రామంలో గణేష్ డ్వాక్రా గ్రూపు సభ్యులు గురువారం సిడిపివో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. బుక్ కీపరు, సెక్రటరీ వీరమ్మ, బుక్ కీపరు లక్ష్మీప్రసన్నలు రూ. 13 లక్షల 76 వేల సొమ్మును బ్యాంకుకు జమ చేయకుండా వాడుకున్నారని, ఆ సొమ్మును బ్యాంకుకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలంటూ గురువారం సీడీపీవో కార్యాలయం వద్ద బాధితులు ధర్నా చేశారు. ఈ ధర్నాలో నాగలక్ష్మి, కస్తూరి, ఈమన ధనలక్ష్మి, అడ్డాల కమల, జె. పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 585

గంగానమ్మ సంబరాలు నేటి నుంచి

గుడ్లవల్లేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో వేంచేసియున్న గంగానమ్మ అమ్మవారి సంబర మహోత్సవాలు శుక్ర, శని, ఆదివారాలు మూడు రోజులపాటు నిర్వహించనున్నామని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల నుంచి 5.30 గంటల వరకూ అమ్మవారి మేలుకొలుపు, పోతురాజు గడ,ఘటాలు, సాయంత్రం మారెమ్మను సాగనంపుట కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. శనివారం అమ్మవారికి చలిదినైవేద్యం ప్రతీ ఇంటివద్ద స్వీకరించుట, పోతురాజు గడ ఊరేగింపు నిర్వహించనున్నామన్నారు. ఆదివారం అమ్మవారి పాలవెల్లి కట్టుట, పాలపొంగళ్ల నైవేద్యంతో సంబరాలు ముగుస్తాయని ఆయన తెలిపారు.



గుడ్లవల్లేరులోని గంగానమ్మ

ప్రమాదకరంగా గుడివాడ ఫ్లై ఓవర్

- ధ్వంసమైన వంతెన రెయిలింగ్
- పాదచారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

(గుడివాడ - ఆంధ్రజ్యోతి) : గుడివాడ-విజయవాడ ఫ్లైఓవర్ బ్రిడ్జి అంచున, రైలింగ్ కింద పిచ్చిమొక్కలు పెరిగి బ్రిడ్జికి పగుళ్ళు ఏర్పడ్డాయి. పట్టణంలోని ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్లాలంటే ఈ ఫ్లైఓవర్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. ముఖ్యంగా బ్రిడ్జి అంచుల్లో, రైలింగ్‌ల వెంబడి పిచ్చి మొక్కలు పెరిగాయి.

అంచనాలు రూపొందించాం

గుడివాడ - విజయవాడ ఫ్లైఓవర్ బ్రిడ్జికి విరిగిన రైలింగ్‌ల మరమ్మతులు, పిచ్చిమొక్కల తొలగింపునకు రూ. 12లక్షలతో అంచనాలు రూపొందించాం. అంచనాలను నివేదికను ఉన్నతాధికారులకు సైతం పంపించాం. నిధులు మంజూరవగానే మరమ్మతు పనులు చేపడతాం.

కామేశ్వరరావు ,ఆర్అండ్‌బీ డీఈ

ఫుట్‌పాత్ పాడై కనీసం పాదచారులు సైతం నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఫ్లైఓవర్ బ్రిడ్జి అంచున, రైలింగ్ కింద దాదాపుగా 6అడుగుల మేర మొక్కలు పెరిగాయంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రైలింగ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. బ్రిడ్జిపై రైలింగ్ కూలిపోతే కింద రహదారిపై వెళ్లే వారిపై పడి ప్రజలు గాయాలపాలయ్యే ప్రమాదముంది. బ్రిడ్జి ఫుట్‌పాత్ మీద పిచ్చిమొక్కలు మొలిచి భయానకంగా మారాయి. ధ్వంసమైన రైలింగ్‌లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతూ సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి ఫ్లైఓవర్ బ్రిడ్జి అంచున మొలిచిన మొక్కలను తొలగించి రెయిలింగ్ పగుళ్లకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఫ్లై ఓవర్‌పై బీటలు వారిన రెయిలింగ్



ఫ్లై ఓవర్ అంచున పెరిగిన పిచ్చిమొక్కలు

అధికారులు పట్టించుకోవడం లేదు

వంతెన మరమ్మతుల నిమిత్తం సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖల్లాలేవు. ప్రమాదకరంగా ఉన్నబ్రిడ్జి మరమ్మతుల విషయంలో అశ్రద్ధ వహించవద్దు. నిధులు విడుదల చేసి త్వరితగతిన పనులను చేపట్టాలి.

వై.వి మురళీకృష్ణ



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎ మ్మెల్యే కుమార్ రాజా

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

పమిడిముక్కల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలను అన్నివిధాలుగా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం వెనుకాడదని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మేడూరుకు చెందిన ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 1,10,707 చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. యార్లగడ్డ శశిధర్‌వెంకట్‌కు రూ. 19,883, వీరంకి సుబ్బారావుకు రూ. 90,824 వారి నివాసాలవద్ద కుటుంబ సభ్యులకు అందజేశారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

నందివాడ : బాలబాలికల సబ్ జూనియర్ స్టేట్ లెవల్ కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా పరిషత్ పాఠశాల (వెన్ననపూడి) ప్రధానోపాధ్యాయులు ఎస్.వై.మదన్‌కుమార్ తండ్రి నర్రా బాబురావు (రిటైర్డ్ హెచ్‌ఎం) సౌజన్యంతో , రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తండ్రి శీరం బసవయ్య సౌజన్యంతో 30 మందికి క్రీడాకారులకు సుమారు 15 వేల విలువైన దుస్తులను గురువారం అందజేసినట్టు పాఠశాల హెచ్‌ఎం మాధవ్ కుమార్ తెలిపారు. పాఠశాల పీడీ యేసురత్నం పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

తోట్లవల్లూరు : దేవరపల్లిలో ఓ వ్యక్తి పెద్దఖర్మ సందర్భంగా గురువారం తెల్లవారుజామున ఆరు గంటలకు కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన భారీ కోడిపందెం శిబిరంపై పోలీసులు ఆకస్మికదాడులు చేశారు. చనిపోయిన వ్యక్తి కోడిపందేల ప్రేమికుడు కావటంతో అతనికి నివాళిగా పెద్దఖర్మను పురస్కరించుకుని అతని కుటుంబసభ్యులు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి కోడిపందేలకు ఆహ్వానించారు. ఈ సమాచారం ఉన్నతాధికారులకు చేరటంతో పోలీసులను అలెర్ట్ చేశారు. వేకువజామున 6 గంటలకు కోడిపందేలు ప్రారంభం కాగా ఎస్సై సీహెచ్ అవినాష్ ఆధ్వర్యంలో గుడివాడకు చెందిన 11 మంది పోలీసులు, తోట్లవల్లూరు పోలీసులు మెరుపుదాడి చేసి 23 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 25 బైక్‌లను, రూ 17,300 నగదును, కోడిపంజులను స్వాధీనం చేసుకున్నారు. 23 మందిని తక్షణమే కోర్టుకి హాజరు పర్చామని ఎస్సై తెలిపారు.



అభిషేకాలు చేసేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు

ముగిసిన వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

గుడివాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : స్థానిక జగన్నాథపురంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పవిత్రోత్సవ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపులో భాగంగా గురువారం మహాపూర్ణాహుతి కార్యక్రమం, చతురుస్థానార్చన, పవిత్ర అవరోహణ, కుంభ ప్రోక్షణలను ఆండాళ్ గోష్టి సభ్యుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు 108 కలశాలతో పంచామృత అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పవిత్రోత్సవాల కార్యక్రమ కర్తలకు స్వామికి సమర్పించిన పవిత్ర మాలలు, ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు మాట్లాడుతూ దేవాలయ పవిత్రత దృష్ట్యా ప్రతి సంవత్సరం వార్షికంగా పవిత్రోత్సవ మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చిట్టిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కేల్లో రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

● జాయింట్ కలెక్టర్ నవీన్

పెదపారుపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ మల్లవరపు నవీన్ సంబంధిత అధికారులకు సూచించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. గురువారం ఆయన గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, స్థానిక తహసీల్దార్ బి.శ్రీను నాయక్‌లతో కలసి మండల పరిధిలోని వెంట్రప్రగడ, వానపాముల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైసు మిల్లుల నుంచి గన్ని సంచులను వెంటనే తీసుకువచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి మరోమారు శిక్షణా తరగతులు నిర్వహించి ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సక్రమంగా కొనుగోలు సాగేలా చూడాలని ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీను నాయక్‌ను జాయింట్ కలెక్టర్ నవీన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెంట్రప్రగడ పీఏసీఎస్ చైర్మన్ కూచిపూడి వెంకట సుబ్బారావు, ఏడీఏ ఎస్.కవిత, ఏవో ఆంజనేయులు, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో ఫణి కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

సొసైటీ పేరు మార్చి ఎన్నిక నిర్వహించడంపై నిరసన

గుడ్లవల్లేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులోని హరిజన ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీని పేరు మార్చి ఎన్నిక జరిపిన నేపథ్యంలో సొసైటీకి చెందిన 24 మంది సభ్యులు ఆ ఎన్నికను బహిష్కరించారు. గుడ్లవల్లేరుకు చెందిన కొందరు 1951 సంవత్సరంలో హరిజన హరిజన ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎస్.ఎస్.1 గా రిజిస్ట్రేషన్ చేశామన్నారు. కాగా గురువారం నిర్వహించిన సంఘ ఎన్నికను సంఘం పేరు మత్స్యకార సహకార సంఘం లిమిటెడ్ ఎస్.ఎస్.1,గుడ్లవల్లేరు పేరిట నిర్వహించారని సంఘానికి చెందిన సొసైటీ మాజీ ప్రెసిడెంట్ ఎం.సత్యానారాయణ ,మాజీ వైస్ ప్రెసిడెంట్ జి.రాంబాబు, గాబ్రేలు, ఆరోపించారు. పేరు మార్చడం పై జిల్లా అధికారులకు ఇంతకు ముందే పిర్యాదులు చేసినా ఫిషరీస్ అధికారులు తమ అభ్యంతరాలను లక్ష్యపెట్టక ఎన్నికలను ఫిషరీస్ అధికారి స్వామిశేఖరరావు నిర్వహించారని ఎన్నికను బహిష్కరించిన సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి వినపతి పత్రం సమర్పించి , నిరసన తెలిపారు.



గుడ్లవల్లేరులో నిరసన తెలుపుతున్న సంఘసభ్యులు

కలెక్టరు,ఎన్నికల అథారిటీ వారి ఉత్తర్వుల మేరకు ఎన్నికల అధికారిగా మచిలీపట్నం మత్యశాఖ సహాయక పర్యవేక్షకులైన డి.స్వామి శేఖరరావు నియమితులైనారు. వారు గురువారం గుడ్లవల్లేరు జిల్లాపరిషత్ హైస్కూల్ ల్లో మత్యకార సహకార సంఘం లిమిటెడ్ నెం: ఎస్.ఎస్1 గుడ్లవల్లేరు కు ఎన్నిక నిర్వహించారు.అధ్యక్షుడిగా కుంచాల ఏడుకొండలు , ఉపాధ్యక్షుడిగా కుంచాల ఆంజనేయిలు , కార్యదర్శి గా కుంచాల దుర్గారావు,మరొ ఆరుగురు డైరెక్టర్లుగా ఎన్నిక ఏకగ్రీవం అయ్యిందని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● చీకటి శేషగిరిరావు

గుడివాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మోటూరు పీఏసీఎస్ పరిధిలోని రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మోటూరు పీఏసీఎస్ చైర్ పర్సన్ చీకటి శేషగిరిరావు అన్నారు. గురువారం మోటూరు ఆర్ఎస్‌కేల్లో పీఏసీఎస్ చైర్మన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పార్టీలకతీతంగా ధాన్యం పండించిన రైతులు, కౌలు రైతులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పది మంది రైతులు వారి ట్రాక్టర్ల పేర్లు, నెంబర్లతో సహా, విస్తీర్ణం తదితర అంశాలతో మోటూరు ఆర్ఎస్‌కేల్లో నమోదు చేయించుకోవటం సంతోషకరమన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ కిరణ్, మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ పరిశీలించారు. మోటూరు ఆర్ఎస్‌కేల్లో ధాన్యం కొనుగోలుకు అన్నీ అనుకూలంగా ఉందని, గోడౌన్ పెద్దగా ఉండటం, రైతులు వినియోగించుకోవటానికి మంచి అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి రైతూ ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని మోటూరు ఆర్ఎస్‌కేల్లో అమ్ముకోవచ్చునని తెలిపారు. పీఏసీఎస్ కార్యదర్శి కొణతం నారాయణరావు, వీఆర్వో సుబ్బారావు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శేషగిరిరావు

రైతుల సంక్షేమమే ధ్యేయం

● వడ్లమూడి యుగంధర్

గుడ్లవల్లేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కౌతవరం పీఏసీఎస్ ద్వారా రైతులకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తూ చేదోడువాదోడుగా ఉంటున్నామని కౌతవరం పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి యుగంధర్ అన్నారు. గురువారం కౌతవరం సొసైటీ కార్యాలయం లో సంఘ సభ్యులకు డివిడెండ్‌లు పంపిణీ చేశారు. 2024-25 సంవత్సరానికి గాను 1071 మంది సభ్యులకు డివిడెంట్ 15 శాతం చొప్పున రూ.25,13,609లు పంపిణీ చేస్తున్నామని యుగంధర్ తెలిపారు. అలానే ఈ ఏడాది గ్రామంలో ఉచిత నేత్రవైద్యపరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశామని ఆయన తెలిపారు. సంఘం నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్, సంఘ కార్యాలయాలకు 10 కేవీ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశామని, పెట్రోల్‌బంక్ వద్ద జనరేటర్‌కు షెడ్, మహాప్రస్థానం వాహనానికి, ఎయిర్ కంప్రెషర్‌లకు షెడ్‌లు, టాయిలెట్‌లు నిర్మించామని యుగంధర్ ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. సభ్యుల కోరిక మేరకు సొసైటీలో అదనపు లాకర్ ఏర్పాటు చేశామన్నారు. సొసైటీ సీఈవో జె.భరత్ కుమార్ పాల్గొన్నారు.



కౌతవరం సొసైటీలో డివిడెంట్ పంపిణీ చేస్తున్న చైర్మన్ యుగంధర్



నిరసన తెలుపుతున్న బాధితుడు, కుటుంబ సభ్యులు

దుకాణాన్ని ధ్వంసం చేసినవారిని కఠినంగా శిక్షించాలి

గుడివాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : మూడుతరాలుగా తమ కుటుంబం జీవనోపాధి పొందుతున్న దుకాణాన్ని కొందరు వ్యక్తులు అర్ధరాత్రి ధ్వంసం చేసి, విలువైన వస్తువులు దోచుకెళ్లారని, వెంటనే తన జీవనోపాధిని నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు అబ్దుల్ వహీద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద వహీద్, అతని కుటుంబసభ్యులు నిరసన తెలిపారు. చింతల కాలువ వెంబడి గల ఇరిగేషన్ స్థలంలో బాధితుడు వహీద్ కుటుంబం గత కొన్ని దశాబ్దాలుగా చెక్క పెట్టెలు తయారీ దుకాణం నిర్వహిస్తున్నాడు. గత నెల 5వ తేదీన కొందరు అర్ధరాత్రి వేళ దౌర్జన్యంగా దుకాణాన్ని ధ్వంసం చేశారు. వహీద్ కుటుంబానికి సంఘీభావంగా మైనార్టీ నాయకులు సయ్యద్ మున్వర్, షేక్ సర్కార్, బిసి సంఘాల నాయకులు మసిముక్కు ఝాన్సీ ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.వై.ఎస్ ప్రసాద్

అంతరిక్ష పరిశోధనలు భావితరాలకు ఆదర్శం

గుడ్లవల్లేరు : అంతరిక్ష శోధన, పరిశోధనలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని , ఇవి ఇంజనీరింగ్ విద్యాంశాలలో ఎంతో ముఖ్య భూమిక వహిస్తాయని పద్మశ్రీ అవార్డు గ్రహీత విశిష్ట విశ్రాంత శాస్త్రవేత్త ఎస్.డి.ఎస్.సి.షార్, ఇస్రోల మజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.వై.ఎస్.ప్రసాద్ అన్నారు. గురువారం శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (ఎస్.ఆర్.జీ.ఈ.సి) లో చివరి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు అంతరిక్ష కేంద్రాలు, అంతరిక్ష జీవితం అనే అంశంపై ఆయన మాట్లాడారు. అంతరిక్షంలో కీలక మరమ్మతులు స్పేస్ వాక్, మనుషుల జీవన విధానం, ఆహారం, ప్రాణవాయువు, నీరు వంటి అంశాలను చిత్ర రూపకంగా చూపించారు. ఈ సందర్భంగా ఆయన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణకుమార్, డైరెక్టర్ డాక్టర్ పి.సిద్దయ్యయాజమాన్య సలహాదారు పి.రవీంద్ర బాబులు సన్మానించారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రి,ఎస్.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంఈవో -2 బాలాజీ

గుడివాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్, అర్బన్ మండలాల్లోని విద్యార్థులు ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో -2 బాలాజీ అన్నారు. గురువారం మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆధార్ నమోదు కానీ విద్యార్థులందరూ అత్యవసరంగా వారి వివరాలతో సహా ఆధార్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, రాయితీలు, తల్లికి వందనం తదితర కార్యక్రమాలన్నీ ఆధార్ నమోదు ఉంటేనే అమలు జరుగుతాయని తెలిపారు. ఉపాధ్యాయులు అశ్రద్ధ వహించకుండా ఆయా పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆధార్ నమోదు చేయించాలని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే మండల స్థాయి అధికారులను అడిగి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. మండలంలోని అందరికీ ఆధార్ నమోదు చేయించటానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో బాలాజీ

కేటీఆర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నేడు

గుడివాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : స్థానిక కేటీఆర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ శుక్రవారం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బి.ఫార్మసీ పూర్తిచేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు యువత అర్హులన్నారు. ఎంపికైన వారికి వేతనంతోపాటుగా ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హాజరుకావాలని కలెక్టర్ బాలాజీ కోరారు. అర్హతలు కలిగిన అభ్యర్థులుముందుగా హెచ్‌టీటీపీఎస్// నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్/యూజర్-రిజిస్ట్రేషన్ లింక్‌లో తప్పనిసరిగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావడంతో పాటు సదరు జాబ్‌మేళాకు తన వివరాలు, బయోడేటా ఫోరంలతో పాటు ఆధార్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబరు, పాన్, సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో రావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెం. 98488 19682, 9666 54641కు సంప్రదించాలని కోరారు.

వనసమారాధనలు భక్తి భావాన్ని పెంపొందిస్తాయి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు ప్రజల్లో భక్తిభావాన్నిపెంపొందింపచేస్తాయని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండిపర్రులో గ్రామస్థులు ఏర్పాటు చేసిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా టీడీపీ, జనసేన నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాలయంలోని ఉసిరి చెట్టుకు, శివపార్వతులకు ప్రత్యేక పూజాధికాలు జరిపించారు. అనంతరం కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలతో సహపంక్తి భోజనాలను చేశారు. ఎమ్మెలే వర్లకుమార్ రాజాను దుశ్శాలవాలతో నిర్వాహకులు సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ జన్నుశోభనబాబు, డైరక్టర్ వీరాంజనేయులు, పసుపులేటి విజయకుమార్, మద్దంశెట్టి సత్యం, విశ్వేశ్వరరావు, ఆలయ అర్చకుడు తోలేటి రామారావు పాల్గొన్నారు.



వనసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

గుడివాడ: స్థానిక గౌరీశంకరస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి జ్వాలాతోరణం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలిపారు. గౌరీశంకరస్వామి దేవస్థానంలోని ఉపాలయమైన షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం దేవస్థాన కమిటీ, దేవాదాయ శాఖల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ నెరుసు సుభాష్ చంద్రబోసు, ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు, వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు పాల్గొన్నారు.



శివలింగాకారంలో వెలిగించిన దీపాలు

గుడివాడ : స్థానిక శ్రీరాంపురంలోని బాలగణపతి స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి మహిళ భక్తులు ఆలయ ఆవరణలో శివలింగాకారంలో దీపాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాదీ కార్తీక మాసంలో దీపోత్సవాలను నిర్వహించి వెన్నెల్లో పాలు కాచి భక్తులకు ప్రసాదంగా అందించడం ఆనవాయితీగా వస్తోందని దేవస్థాన అర్చకులు స్వర్ణ శివరామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు మల్లేశ్వరరావు, కోటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది

● వీరంకి వెంకట గురుమూర్తి

తోట్లవల్లూరు : జగన్‌ను ప్రాపకం పొందేందుకు మాజీ మంత్రి పేర్ని నాని, వైసీపీ నేతలు సీఎం చంద్రబాబుపైనా, మంత్రి లోకేశ్‌పైనా అడ్డగోలుగా విమర్శలు చేయటం సరికాదని, అధికారంలో ఉండగా జగన్ రహదారులపై పరదాలు కట్టకుండా, చెట్లు తొలగించకుండా ఒక్క రోజైనా ప్రజల మధ్యకు వచ్చాడా అని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పేర్ని నాని విమర్శలను తీవ్రంగా ఖండించారు. తుపాను వచ్చిన 9 రోజుల తరువాత జగన్ రైతుల పరామర్శకు రావటం సిగ్గుచేటన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 585



మంత్రి కొల్లు రవీంద్ర ప్రజాదర్బార్ నేడు

మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. పేర్కొన్నారు. ప్రజాదర్బార్‌లో ఇచ్చిన ప్రజల నుంచి స్వీకరించి అర్జీల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్‌కు అర్జీదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

వైసీపీ నేతల దుశ్చర్యలు అన్నీఇన్నీ కావు

ఎదురుమొండి వారధి నిర్మాణం కాకుండా చేశారు : ఎమ్మెల్యే మండలి

అవనిగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎదురుమొండి - ఏటిమొగ వంతెన నిర్మాణం ప్రారంభం కాకపోవటానికి వైసీపీ నేతల దుశ్చర్యలే కారణమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమావేశం గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 2018లో ఎదురుమొండి వారధి కోసం ఆసియా బ్యాంక్ నుంచి నిధులు మంజూరు చేయిస్తే జగన్ అనుకూల అధికారులు దానికి కొర్రీలు పెట్టారన్నారు. నాటి ఎంపీ వల్లభనేని బాలశౌరి తన స్నేహితుడైన నాబార్డు చైర్మన్ ద్వారా ఎదురుమొండి వారధికి నిధులు తీసుకొస్తే దివి ప్రాంత పర్యటనకు వచ్చిన నాబార్డు చైర్మన్ ముందే నాటి నేతలు తమ దుశ్చర్యలతో పనులకు ఆటంకం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎదురుమొండి వారధి పనులు ప్రారంభకాకపోవటానికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబే అన్నారు. వారధి నిర్మాణానికి నాబార్డు రూ.109 కోట్లు విడుదల చేస్తే ఆ నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. ఇటీవల మొంథా తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇక్కడి సమస్యలను తెలుసుకుని వెంటనే ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారని, అందులో భాగంగానే ఎదురుమొండి వారధికి నిధులు ఇస్తున్నట్లు ప్రకటించారన్నారు. పవన్ కల్యాణ్ పర్యటన కారణంగా నియోజకవర్గానికి రూ.100 కోట్లకుపైగా మేలు చేకూరిందని అన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ, మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, వెంకట్రామ్, శేషుబాబు, మర్రే గంగయ్య, పూషడపు రత్నగోపాల్, అర్జా రాధిక, బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, బాను నాంచారయ్య నాయుడు, కొండవీటి సునీత, కోలపల్లి శ్రీ వర్ష, బొప్పన భాను, కటికల వసంత్, సిద్ధినేని కుమార్ రాజా, కనగాల వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి శ్రీదుర్గా పాల్గొన్నారు.

నాలుగు మత్స్యకార కో-ఆపరేటివ్ సంఘాలు ఏకగ్రీవం

నాగాయలంక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాలుగు మత్స్యకార కో-ఆపరేటివ్ సంఘాలకు గురువారం అధికారులు ఎన్నికలను నిర్వహించారు. నాగాయలంక మండలంలోని దీనదయాళ్‌పురం మెరైన్ ఫిషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఒడుగు నాగార్జున వర్మ, కమ్మనమోలు మెరైన్ ఫిషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఒడుగు ప్రసాద్, వర్రచివర మెరైన్ ఫిషర్ మెన్ సొసైటీ అధ్యక్షుడిగా అంద్రాజు వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మండలంలోని పులిగడ్డ శ్రీనివాస ఫిషర్‌మెన్ సొసైటీకి సింగోతు బాబురావు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మత్స్యశాఖ ఏడీ ఆర్.ప్రతిభ తెలిపారు.



కొనకళ్ల నారాయణ, .ఫణికుమార్, బుల్లయ్యలను సత్కరిస్తున్న నాయకులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కాగిత వెంకటేశ్వరరావు, మొక్కలు నాటుతున్న హసీంబేగ్, అజీమ్ తదితరులు

కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు

మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం, పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి కూటమి ప్రభుత్వంలో పదవులు దక్కుతాయని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన పి.వి.ఫణికుమార్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్యలను రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్ సత్కరించారు. బ్రాహ్మణ సంఘ నాయకులు వేమూరి పవన్‌కుమార్ శర్మ, తంగిరాల మిథున వ్యాస్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. బచ్చుపేట వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో పి.వి. ఫణికుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్‌ను ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ముత్తేవి రవికాంత్ సత్కరించారు. లోగిశెట్టి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. వేదపండితులు ఆశీర్వదించారు.

ఐదుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు

చిన్నాపురంలో గురువారం ఐదుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ ఎంపీపీ, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అందజేశారు. గుర్రైన కొండపల్లి మంగా లక్ష్మికి రూ.30,028, నందం నరేంద్రకు రూ రూ.30 వేల చెక్కు జన్ను వేణుకు రూ.18 వేలు, దేవరపల్లి జ్యోతిర్మయికి రూ.35 వేలు, మట్టా శ్రీశాంతికి రూ 30,028 చెక్కును అందజేశారు. కూటమి నాయకులు కాట్రగడ్డ రాంబాబు, కేసన రమేష్ , చలమలశెట్టి రమేష్, పినిశెట్టి నిరంజనరావు, కాగిత గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన హసీంబేగ్

బందరును సుందరంగా తీర్చిదిద్దుదామని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్ అన్నారు. ఇంగ్లీషుపాలెంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని హసీంబేగ్ చేపట్టారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ జాయింట్ సెక్రటరీ పి.వి.ఫణికుమార్, అజీమ్, అశోక్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి టీడీపీ సాయం

కోడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పిట్టలంకలో అగ్నిబాధిత కైలా శరత్ బాబు కుటుంబానికి టీడీపీ శ్రేణులు రూ.10 వేలు ఆర్థిక సాయమందించారు. బండే శ్రీనివాసరావు, తోట సాంబయ్య, కొప్పనాతి సత్యనారాయణ, కనగాల వెంకటేశ్వరరావు, పూతబోయిన శ్రీనివాసరావు, పిల్లి మల్లిఖార్జునరావు, రేపల్లె ప్రతాప్, గుత్తి ప్రసాద్, అప్పికట్ల రవీంద్ర, బడే పిచ్చియ్య, గాదె భాస్కరరావు పాల్గొన్నారు.

యుగంధర్‌కు పరామర్శ

అనారోగ్యానికి విశ్రాంతి తీసుకుంటున్న గంగానమ్మ ఆలయ చైర్మన్ కోట యుగంధరరావును టీడీపీ శ్రేణులు పరామర్శించారు. ఆయన వెంటనే కోలుకోవాలని ఆకాంక్షించారు. కోడూరు టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, నాయకులు అప్పికట్ల రవీంద్ర బాబు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, పూతబోయిన శ్రీనివాసరావు, కాగిత శివప్రసాద్, పిల్లి మల్లిఖార్జునరావు, బొడ్డు వెంకన్న, పూతబోయిన లక్ష్మణరావు, బండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చెట్లకొమ్మల తొలగింపు పనుల పరిశీలన

కోడూరు : మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు తెలిపారు. తుఫాన్ ప్రభావంతో కోడూరు ఈస్ట్‌చానల్ 11వ నెంబరు పంటకాలువలో పడిన చెట్ల కొమ్మల తొలగింపు పనులు ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘం సభ్యులు చేపట్టారు. ఈ పనులను గురువారం టీడీపీ నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. టీడీపీ నాయకులు పూతబోయిన శ్రీనివాసరావు, పిల్లి మల్లిఖార్జునరావు, కాగిత ప్రసాద్, బొడ్డు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు అంచనాలు

ఆర్ అండ్ బీ ఈఈ లోకేశ్వరరావు



మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా జిల్లాలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు అంచనాలు రూపొందిస్తున్నట్లు ఆర్ అండ్ బీ ఈఈ లోకేశ్వరరావు తెలిపారు. జిల్లాలో కొన్ని రోడ్లలో వాహనాలు తిరిగే పరిస్థితి కూడా లేని విషయం వాస్తవమేనన్నారు. చీఫ్ ఇంజనీర్ విజయశ్రీ జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్నారన్నారు. గుడివాడ - కంకిపాడు, గన్నవరం - మానికొండ, ఉప్పలూరు - కోమటిగుంటలాకులు, కోలవెన్ను రోడ్లు శిథిలమైన మాట వాస్తవమేనన్నారు. వివిధ డివిజన్లలో ఇంజనీర్లు శిథిలమైన రోడ్లపై ఎస్టిమేట్లు వేస్తున్నారన్నారు. చీఫ్ ఇంజనీర్ రోడ్లను పరిశీలిస్తున్నారన్నారు

చలమలశెట్టి సురేంద్రనాథ్ మృతికి మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి సంతాపం

మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైద్యుడు, మచిలీపట్నం మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ చలమలశెట్టి వెంకటలక్ష్మి భర్త చలమలశెట్టి సురేంద్రనాథ్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీ ఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, రాష్ట్ర టీడీపీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. సురేంద్రనాథ్ కుమారులు సునీల్, వెంకటేష్, అనిల్‌లను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి



మడకలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన రూరల్, నవబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి గిట్టుబాటు ధర పొందాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మడక గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ధాన్యం మిల్లుకు వెళ్లిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయన్నారు. రైతులు తమకు ఇష్టమైన మిల్లులకు ధాన్యం తోలుకోవచ్చన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్, ఏవో ఎస్. జెన్నీ, కాకర్లమూడి సర్పంచ్ పరసా కామేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం మద్దతు ధర రూ.2389

బంటుమిల్లి : రైతు శ్రేయేస్సు ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ కాగిత పూర్ణచంద్రరావు అన్నారు. మల్లేశ్వరం మార్కెట్టు యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలన్నారు. 17 శాతం కన్నా తక్కువ తేమ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటా రూ.2389, సాధారణ రకం రూ.2369లు మద్దతు ధరగా చెల్లిస్తుందన్నారు. ఆర్ఐ శంకర్, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల ఏవోలు అజయ్ కుమార్, మాధురికిరణ్, సరిత, బ్రహ్మం, రైతులు బొర్రా రాంబాబు, జూలూరి సంపత్‌కుమార్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు ఎమ్మెల్యే కాగిత శంకుస్థాపన

కృత్తివెన్ను, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. చినపాండ్రాకలో ఓఎన్‌జీసీ సహకారంతో రెండు రోడ్ల నిర్మాణాలకు కాగిత శంకుస్థాపన చేశారు. చినపాండ్రాక రైస్ మిల్లు నుంచి రామాపురం వరకు, నాలుగు రోడ్ల కూడలి నుంచి ఇంతేరు రోడ్డు వరకు రూ.3.65 కోట్లతో రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, డీసీ నెక్కంటి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు, కార్యదర్శి యాదంరెడ్డి కొండ, చేకూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బొల్లా కుటుంబానికి రూ.5 లక్షల సాయం

గూడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన టీడీపీ నాయకుడు బొల్లా రామ్మోహనరావు కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కును గురువారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు. ఆకుమర్రు గ్రామ టీడీపీ అధ్యక్షుడుగా బొల్లా రామ్మోహనరావు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి, గోపీ నాగబాబు, కాసగాని శ్రీనివాసరావు, బొల్లా రాజేష్, గంజాల కృష్ణమోహన్, మురాల హరి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

ఘంటసాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ ఈఈ ఎస్.వెంకట్రావు పేర్కొన్నారు. శ్రీకాకుళం గ్రామపంచాయతీ కార్యాలయం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ఇళ్లు కట్టించి ఇస్తామని అగ్రిమెంట్ చేసుకున్న కాంట్రాక్టర్ తమను మోసం చేశారని, నివేశన స్థలాలు కూడా గోగినేనిపాలెం శివారులో ఇచ్చారని, వాటిని రద్దు చేసి శ్రీకాకుళంలో ఇవ్వాలని కోరారు. సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ మాట్లాడుతూ శ్రీకాకుళం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోగినేనిపాలెం గ్రామ పరిధిలో నివేశనాస్థలాలు కేటాయించటం సరికాదన్నారు. వాటిని రద్దు చేసి శ్రీకాకుళంలోనే నివేశనాస్థలాలు కేటాయించాలని సూచించగా, ఆన్‌లైన్ అయిన తర్వాత తమ పరిధిలో ఏమీ ఉండదన్నారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు, ఏఈ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల వినతి

అవనిగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని దివి పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.రామకృష్ణ, అబ్దుల్ అజీజ్ నేతృత్వంలో విశ్రాంత ఉద్యోగులు జిల్లా ఖజానా అధికారి రవికుమార్‌కు విజ్ఞప్తి చేశారు. పెన్షనర్ల భవనంలో సమావేశం నిర్వహించి అనంతరం అవనిగడ్డ వచ్చిన జిల్లా ఖజానా అధికారిని మర్యాదపూర్వకంగా కలసి తమ సమస్యలు వివరించారు. కె.సుధాకర్, ఆర్.రాధాకృష్ణ, నరసింహారావు, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా జ్వాలాతోరణం

కోడూరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా లోక కళ్యాణార్థం కోడూరు శివరామకృష్ణ క్షేత్రం వద్ద జ్వాలాతోరణం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శివరామకృష్ణ జ్వాలాతోరణాన్ని వెలిగించారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కనకదుర్గమ్మ ఆలయం వద్ద సహస్ర దీపాలంకరణ చేశారు.

గ్రంథాలయానికి బాపిరాజు రచనలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథ సత్యనారాయణ, అడివి బాపిరాజు నవలలను గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి మున్సిపల్ కమిషనర్ బాపిరాజు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.వి.ఫణికుమార్, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కోటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది బి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో బల్లిపర్రు సందర్శన

పెడన రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తడి,పొడి చెత్త సేకరణలో అన్ని పంచాయతీలు సమర్థంగా పనిచేయాలని జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు అన్నారు. బల్లిపర్రులో గురువారం ఆయన పర్యటించారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తే సంపద సృష్టంచవచ్చన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ఎంపీడీవో అరుణకుమారి పాల్గొన్నారు.

ఘనంగా కాపు వనసమారాధన

నాగాయలంక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాపు సామాజిక వర్గమంతా ఐక్యంగా ఉండాలని కాపు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. కాపు కార్తీక వనసమారాధన కార్యక్రమం గురువారం టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. శ్రీ కృష్ణదేవ రాయ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు భోగాది సోమశేఖర్ అధ్యక్షత వహించారు. సామినేని ఉదయభాను, బండ్రెడ్డి రామకృష్ణ, గాళ్ల సుబ్రహ్మణ్యం, సంకట లక్ష్మణరావు, చందు జనార్దనరావు, బుల్లెట్ ధర్మారావు, ఊచా ప్రసాద్, నాగార్జున తదితరులు ప్రసంగించారు. అనంతరం కార్తీక వనభోజనాలు జరిగాయి. తోట శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.